

వరద బాధిత రైతులకు రూ.36కోట్లు జమ చేశాం

» జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఏలేరు జలాశయానికి వచ్చిన వరదల వల్ల పంటనష్టపోయిన రైతులకు రూ.36కోట్లు పరిహారం బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో నష్టపోయిన రైతులు, కౌలురైతులు కలిపి 26613 మందికి పరిహారం ఇచ్చామన్నారు. క్షేత్రస్థాయిలో పంటనష్ట గణన చేపట్టి నష్టపోయిన ప్రతిఒక్క రైతుకు పరిహారం ఇచ్చామన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కలెక్టరేట్‌లో జరుగుతుందని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు విధిగా హాజరు కావాలని ఆదేశించారు.



కాకినాడ సండే మార్కెట్‌లో జరుగుతున్న అమ్మకాలు

సరిపోదా ఆదివారం! 8



» కాకినాడ సండే బజారు.. తెల్లవారుజాము 4 గంటలనుంచే సందడి

» కొత్తవి, పాతవి అన్నీ ఒకేచోట దొరికే మార్కెట్

డ్రైవర్ డ్యాన్స్‌కు మంత్రి లోకేశ్ ఫిదా! 8

» డ్యాన్స్ సూపర్ బ్రదర్ అంటూ కితాబు

» తుని బస్సు డిపో కాంట్రాక్ట్ డ్రైవర్ డ్యాన్స్ వైరల్

» ప్రశంసిస్తూ 'ఎక్స్'లో మంత్రి లోకేశ్ ట్వీట్

» విధులకు రావొద్దని డిపో సీఐ మౌఖిక ఆదేశాలు!



నృత్యం చేస్తున్న డ్రైవర్ లోవరాజు

ఈఎస్ఐ.. ఇంకెప్పుడో?



కాకినాడ డెయిరీఫారం సెంటర్‌కు వెళ్లేదారిలో పోర్టు రైల్వేస్టేషన్ వద్ద నిర్మించిన ఈఎస్ఐ ఆస్పత్రి



కాకినాడలో రూ.114కోట్లతో నిర్మించిన ఈఎస్ఐ ఆస్పత్రికి గ్రహణం పట్టింది. దీని నిర్మాణం పూర్తయినా ఇప్పటికీ వైద్యసేవలు మొదలవక లక్షలమంది ఉద్యోగుల కుటుంబాలు ఎదురుచూస్తున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రధాని మోదీ వర్చువల్‌గా రాజ్‌కోట్ నుంచి ఈ ఆస్పత్రిని ప్రారంభించారు. అయినా ఇప్పటికీ ఓపీ, ఇన్‌పేషెంట్ సేవలు పూర్తిగా మొదలవలేదు.

» కాకినాడ ఈఎస్ఐ ఆస్పత్రి కార్యకలాపాలకు మోక్షం ఎప్పుడోనని ఎదురుచూపులు

» రూ.114కోట్లతో వంద పడకల ఆస్పత్రి నిర్మాణం పూర్తయినా సేవలపై నీలినీడలు

» ఈఏడాది ఫిబ్రవరిలో రాజ్‌కోట్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ

» అయినా ఇప్పటికీ మొదలవని సేవలు: ఆపరేషన్ థియేటర్లకు పరికరాలూ నిల్

» రోగులకు పడకలకు ఇప్పటికీ దిక్కులేని వైనం: పూర్తిస్థాయి సిబ్బంది నియామకం కరువు

» అడ్డగోలు ఉద్యోగాల నియామకాలు రద్దు చేయకపోవడంపై కూటమి నేతల ఆగ్రహం

» మరోపక్క సేవలు మొదలవక 2.40 లక్షల ఉద్యోగులు కుటుంబాలు ఎదురుచూపులు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఆపరేషన్ థియేటర్లకు పరికరాల నుంచి రోగులకు పడకల వరకు ఏవీ ఇంకా అసలు సమకూరలేదు. అటు వైద్యులు, ఇతర నర్సింగ్ ఉద్యోగుల భర్తీ కూడా జరగలేదు. దీంతో ప్రధాని మోదీ ప్రారంభించిన ఈఎస్ఐ ఆస్పత్రికి ఈ గతి పట్టడంపై తీవ్రస్థాయిలో చర్చ జరుగుతోంది. గత అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని నెలల ముందు ఈ ఆస్పత్రిలో కొన్ని దిగువస్థాయి పోస్టులను డబ్బులకు అమ్మేసుకున్నారని అప్పటి ఎంపీ వంగా గీతపై ఫిర్యాదులు వచ్చాయి. ఈలోపు ప్రభుత్వం మారడంతో గతంలో అమ్మేసిన పోస్టులపై ప్రస్తుతం రాద్ధాంతం జరుగుతోంది. కూటమి నేతల ఫిర్యాదులపై అధికారులు ఎటూతేల్చక గాలికి వదిలేశారు. దీంతో ఆస్పత్రి సేవలపై నీలినీడలు కమ్ముకున్నాయి.

సేవలందేది ఎప్పుడో..

కాకినాడలో ఈఎస్ఐ ఆస్పత్రికి పూర్తిస్థాయి విశాల భవనం లేకపోవడంతో నగరంలోని డెయిరీఫారం సెంటర్‌కు వెళ్లేదారిలో పోర్టు రైల్వేస్టేషన్‌ను ఆనుకుని 7.26ఎకరాల్లో కేంద్రప్రభుత్వం 2020లో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణం చేపట్టింది. ఇందుకు రూ.114కోట్లు నిధులు ఇచ్చింది. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులతోపాటు ఈఎస్ఐ పరిధిలోని ప్రైవేటు రంగ ఉద్యోగులు సైతం చికిత్స తీసుకునేలా 100పడకల సామర్థ్యంతో కేంద్రం దీన్ని నిర్మించింది. ఈ ఆస్పత్రిని ఈఏడాది ఫిబ్రవరి 25న ప్రధాని మోదీ రాజ్‌కోట్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. అప్పటికే ఆస్పత్రి మొత్తం సిద్ధమైంది. దీంతో ప్రధాని ప్రారంభించడంతో వైద్యసేవలు ప్రారంభమే తరువాయి అనిఅంతా అనుకున్నారు. తీరాఇప్పటికి 9నెలలు దాటిపోతున్నా వైద్య సేవలు అసలు ప్రారంభమే కాలేదు. దీంతో అసలు ఈ ఆస్పత్రి సేవలు మొదలవడానికి ఎంతకాలం పడుతుందో కూడా తెలియని పరిస్థితి. ఈపాటికే ఈ ఆస్పత్రికి వంద పడకలు, ఆపరేషన్ థియేటర్లు పూర్తిస్థాయిలో సిద్ధమై ఉండాలి. వైద్యులు, ఇతర సిబ్బంది భర్తీ జరగాలి. కానీ నెలలు గడిచిపోతున్నా ఇవేవీ ఆచరణకు నోచుకోవడంలేదు. ఇక్కడి ఈఎస్ఐ ఆస్పత్రిలో 15కీలకవిభాగాల్లో వైద్యసేవలు అందించాలని కేంద్రం నిర్ణయించింది. కానీ ఏ విభాగానికీ పూర్తిస్థాయి వైద్య సిబ్బంది, అవసరమైన వైద్య పరికరాలు అందలేదు. అసలు ఇవి ఎప్పుడు వస్తాయో కూడా తెలియని పరిస్థితి.

ఆ వివాదమే కారణమా..

రూ.114కోట్లతో నిర్మాణమైన భారీ ఈఎస్ఐ ఆస్పత్రికి వందల్లో వైద్యసిబ్బంది అవసరం ఏర్పడింది. నర్సులు, అటెండర్లు, బాయ్‌లు, ఇతర సహాయ సిబ్బంది పోస్టులు పెద్దఎత్తున భర్తీ చేయాల్సి ఉంది. ఇందులో కొన్ని అవుట్‌సోర్సింగ్ విధానంలో తీసుకోవాల్సి ఉంది. ఇవన్నీ ముందే పసిగట్టిన అప్పటి వైసీపీ నేతలు ఫిబ్రవరి కంటే ముందుగానే భారీగా పోస్టులు అమ్మేసుకున్నారు. వార్డుబాయ్‌లు, అటెండర్లు, ఇతర పారామెడికల్ సిబ్బందికి సంబంధించిన పోస్టులు ఒక్కోటి రూ.5లక్షల నుంచి రూ.10లక్షల వరకు తీసుకుని వేలం పెట్టేశారు. ఈక్రమంలో అప్పటి ఎంపీ వంగాగీత భారీగా ఈ పోస్టుల్లో సొమ్ము చేసుకున్నారని టీడీపీ నేతలు ఆరోపించారు. చర్యలు తీసుకోవాలని అధికారంలోకి వచ్చిన తర్వాత ఈఎస్ఐ అధికారులకు కూటమి నేతలు ఫిర్యాదు చేశారు. ప్రస్తుత ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ సైతం గతంలో జరిగిన పోస్టుల అమ్మకాన్ని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లారు. అప్పట్లో అడ్డగోలుగా విక్రయించిన పోస్టులను రద్దు చేయాలని పలువురు నేతలు లిఖితపూర్వకంగా కేంద్రానికి కూడా ఫిర్యాదు చేశారు. మరోపక్క ప్రభుత్వం మారడంతో ఈఎస్ఐ ఆస్పత్రిలో పోస్టులకు కొందరు కూటమి నేతలు సిఫార్సు చేస్తున్నా ఈఎస్ఐ ఆస్పత్రి అధికారులు వినిపించు కోవడంలేదు. అలాగని గత వైసీపీ నేతల హయాంలో నియమించిన అడ్డగోలు పోస్టులను రద్దు చేయడం లేదు. ఈక్రమంలో తాత్కాలి పద్ధతిలో నియమించే పోస్టుల గొడవ ఎటూ తేలని పరిస్థితి. దీంతో ఇప్పటికీ ఈపోస్టులను అవుట్‌సోర్సింగ్ విధానంలో కొత్తగా భర్తీ చేయాలా? లేదా? అనేది అధికారులు తేల్చడం లేదు. కానీ కూటమి ప్రభుత్వ నేతలు ఎవరు నిలదీసినా అంతా కేంద్రం చూసుకుంటుందని చెబుతూ తప్పించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అసలు ఈఎస్ఐ ఆస్పత్రి సేవలు ఎప్పుడు పట్టాలెక్కుతాయో అనేది అంతుచిక్కని ప్రశ్నగా మారింది.

అరకొరగా 40మందికి ఓపీ సేవలు..

వంద పడకలకు సంబంధించి తొలిదశ కింద అదిగో ఇదిగో 40 పడకలు వస్తున్నాయని అధికారులు అంటున్నా వచ్చేది మాత్రం కనిపించడం లేదు. కీలక విభాగాల ఆపరేషన్ థియేటర్లకు శస్త్రచికిత్స పరికరాలు ఒక్కటి కూడా రాలేదు. వీటి సరఫరాకు టెండర్లు పిలిచినా అవేమయ్యాయో కూడా తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఫిబ్రవరిలో ప్రారంభించిన ఆస్పత్రి సేవలు మొదలవక అలంకారప్రాయంగా మారింది. ప్రస్తుతం ఇక్కడి ఈఎస్ఐ ఆస్పత్రికి గతనెలలో 13మంది వైద్యులను నియమించారు. కానీ ఇతర సిబ్బంది నియామకం మాత్రం జరగలేదు. ఇలా దాదాపు అన్ని కీలక విభాగాలకు సంబంధించి ఏపనీ కూడా పూర్తిగా జరగలేదు. దీంతో వీటి సేవల కోసం ఎదురుచూస్తోన్న దాదాపు 60వేల మంది ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులకు చెందిన 2.50లక్షల కుటుంబాలు ఉసూరుమంటున్నాయి. ఏ చిన్నఅవసరం వచ్చినా ఈఎస్ఐ సదుపాయం ఉండి ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తున్నారు. కొద్దిపాటి వైద్యులతో కొన్నినెలలుగా ఏదో అరకొరగా 40మందికి ఓపీసేవలు అందిస్తున్నారు. ఇది కూడా వారంలో కొన్నిరోజులే. ఈ నేపథ్యంలో ఈఎస్ఐ ఆస్పత్రి పూర్తిస్థాయిలో ఎప్పుడు ప్రారంభం అవుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది. ఆస్పత్రి కీలక విభాగాలకు పూర్తిస్థాయి సిబ్బంది, వైద్యపరికరాలు, పడకలు, మందులు రావడానికి ఎంతకాలం పడుతుందో అంతుచిక్కడంలేదు.

ప్రమాదం జరిగితే.. బాధ్యత ఎవరిది?



కాకినాడ మెయిన్ రోడ్డు రద్దీ ప్రదేశంలో ఏర్పాటు చేసిన దీపావళి సామాగ్రి దుకాణం

» రద్దీ ప్రదేశాల్లో అనుమతులు ఎలా ఇచ్చారని అనుమానాలు

» కాకినాడ మెయిన్‌రోడ్డులో దీపావళి సామగ్రి విక్రయానికి నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): బాణాసంచా నిల్వలు ఉండాలన్నా, దుకాణం పెట్టాలన్నా ఎన్నో నిబంధనలు అడ్డొస్తాయి. కానీ అవేమీ పట్టనట్లు వారికి కావాల్సిన నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలకు అనుమతులు ఇస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే మాకేంటి అనే ధోరణిలో నిబంధనలకు విరుద్ధంగా దీపావళి మందుగుండు సామాగ్రి దుకాణాలను తమకు కావాల్సిన వారికి అనుమతులు ఇప్పిస్తున్నారు. జరగరానిది ఏమైనా జరిగితే దానికి బాధ్యులు ఎవరని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

దీపావళి సామాగ్రి దుకాణానికి కాకినాడ మెయిన్‌రోడ్డులో టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఒక దుకాణానికి అనుమతి ఇవ్వడంపై ప్రజలు మండిపడుతున్నారు. అంత రద్దీ ప్రదేశంలో అసలు అనుమతి ఎలా ఇచ్చారో అర్థం కావడంలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు కూడా ఆ ప్రదేశాన్ని పరిశీలించకుండానే అనుమతులు ఇచ్చారనే అనుమానం కూడా తలెత్తుతోంది. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉంటే అనుమతిచ్చేవారు కాదన్న వాదన వినిపిస్తోంది. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి కనీసం నిబంధనలు పట్టించుకోకుండా అనుమతులు మంజూరు చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనుమతి ఇచ్చిన పత్రాల్లో దుకాణం చిరునామా లేకపోవడమే ఇందుకు కారణం. సాధారణంగా దీపావళి సమీపిస్తుందంటే అధికారులు ప్రజల్లో అవగాహన కల్పించడానికి ఎన్నో కార్యక్రమాలు చేపడతారు. ఇందులో భాగంగా ఏఏ ప్రదేశాల్లో మందుగుండు సామాగ్రి దుకాణాలు, వాటి నిల్వలు ఉంచాలి, వాటికి తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తారు.

మందుగుండు సామగ్రి దుకాణం పెట్టాలంటే..

పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక తదితర శాఖల నిబంధనల ప్రకారం అనుమతులు పొంది జాగ్రత్తలను విధిగా పాటించాలి. నిబంధనలకు అనుగుణంగా బాణాసంచా సామాగ్రి తయారీ, నిల్వ కేంద్రాలు నివాసాలకు నిర్దేశించిన దూరంలో తప్పనిసరిగా ఉండాలి. అనుమతులు పొందిన షాపు యజమానులు జన సంచారం లేని చోట, విశాలమైన ఖాళీ ప్రదేశంలో విక్రయించుకోవాలి. జనావాసాలకు, విద్యాసంస్థలకు, ఆలయాలకు, ఆస్పత్రులకు దూరంగా బాణాసంచా నిల్వలు ఉండాలి. ప్రతి దుకాణంవద్ద ఫైర్ డిస్టింగ్విషర్లు, బకెట్లలో పొడిఇసుక, నీరు అందుబాటులో ఉండాలి. లైసెన్సులు లేకుండా మందుగుండు సామాగ్రి తయారు చేసిన, నిల్వ చేసిన, విక్రయించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తారు. కానీ, పర్యవేక్షణ, పరిశీలన, తనిఖీలు లేకుండా అధికారులు అనుమతులు ఇస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. దుకాణాల ఏర్పాటులో నిబంధనలు తప్పక పాటించాలంటూనే అడ్డగోలుగా అనుమతులు ఎలా ఇస్తున్నారో వారికే తెలియాలి.

పోషక బియ్యం.. మరో నాలుగేళ్లు

» 'ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన' 2028 వరకూ పెంపు

» ఉచితంగా పంపిణీ చేయాలని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

పెద్దాపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఆహార భద్రత చట్టం అమలులో భాగంగా అందజేస్తున్న పోషక బియ్యం మరో నాలుగేళ్ల పాటు ఉచితంగా ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కొవిడ్ సమయంలో ఆరికంగా ఇబ్బందులకు గురైన పేదలను ఆదుకునేందుకు కేంద్రం ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన(పీఎంజీకేఏవై) కింద ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తోంది. 2021 నుంచి 3 నెలలకు ఒకసారి పథకాన్ని పొడిగిస్తోంది. గత డిసెంబరులో ఏడాదిపాటు ఉచితబియ్యం అందించనున్నట్లు ప్రకటించింది. ఈ గడువు మరో రెండు నెలల్లో ముగియనుంది. ఇటీవల కేంద్ర మంత్రివర్గ సమావేశంలో మరోనాలుగేళ్లపాటు ఉచితంగా బియ్యం అందించాలని నిర్ణయం తీసుకున్నారు. 2028, డిసెంబరు వరకూ ఆహార భద్రత కార్డుదారులకు ఉచిత బియ్యం పంపిణీకీ కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపడంతో ప్రయోజనం కలగనుంది.

2028 వరకూ ఉచితంగానే పంపిణీ

పీఎంజీకేఏవైలో భాగంగా జాతీయ ఆహార భద్రత చట్టం పరిధిలోని కార్డులకు కేంద్రం ఉచిత బియ్యం పంపిణీ చేస్తోంది. మిగిలిన కార్డుదారులకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై అందిస్తోంది. గతంలో లబ్ధిదారులకు సార్టెక్స్, నాన్ సార్టెక్స్ బియ్యం పంపిణీ చేస్తుండగా కేంద్రం ఆదేశాలతో గతేడాది సెప్టెంబరు నుంచి పోషక బియ్యంపంపిణీ ప్రారంభించారు. సార్టెక్స్ బియ్యంలో 15శాతం, నాన్‌సార్టెక్స్ బియ్యం లో 25శాతం వరకూ నూకలు ఉంటాయి. గతంలో వీటినే ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేసేవారు. పోషక బియ్యం పంపిణీ చేయాలనే లక్ష్యంతో 100కిలోల సార్టెక్స్ బియ్యంలో యంత్రాలతో కిలో కెర్నల్ (పోషకాహారం) కలిపి పంపిణీ చేస్తున్నారు. ఈ బియ్యంలో విటమిన్ బి-12, ఫోలిక్ యాసిడ్, ఐరన్ ఉంటాయి. ప్రతి లబ్ధిదారులకు నెలకు ఐదు కిలోల చొప్పున పంపిణీ చేస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

జాతీయ ఆహార భద్రత చట్టం పరిధిలోని పీఎంజీకేఏవై కార్డుదారులకు 2028 వరకూ ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తారు. లబ్ధిదారులందరికీ పోషక బియ్యం అందుతాయి. పోషక విలువలతో కూడిన బియ్యాన్ని కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలి.

-ప్రసాద్, జిల్లాపౌరసరఫరాలఅధికారి, కాకినాడ

రీసర్వే చిక్కులపై కదలిక

» జిల్లావ్యాప్తంగా గ్రామసభలు ప్రారంభం

» మూడు రోజుల్లోనే జిల్లాలో 2,100 పైబడి అర్జీలు నమోదులు

సామర్లకోట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న రీసర్వే సమస్యపై ప్రభుత్వంలో ఎట్టకేలకు కదలిక వచ్చింది. రైతులనుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. సమస్యల పరిష్కారం ఎప్పుడనేది అధికారులకు స్పష్టత లేనప్పటికీ ప్రజలనుంచి అర్జీలు మాత్రం స్వీకరిస్తున్నారు. మరో వైపు రైతాంగం మాత్రం సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోరుకొంటుంది. ఇప్పటికే ప్రతీ గ్రామసభలోనూ 25 నుంచి 35అర్జీల వరకూ రైతుల నుంచి వస్తుండడం గమనార్హం. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకూ 2,100 అర్జీల పైబడి అందినట్లు తెలిసింది.

పైలట్ ప్రాజెక్ట్‌గా..

రీసర్వే పేరిట గత వైసీపీ ప్రభుత్వం నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. మండలానికి ఒక చిన్న గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా తీసుకుని భూములను సర్వే చేసింది. ఆయా గ్రామాలలోనే లోపాలు తలెత్తినా వాటిని ఏమాత్రం సవరించకుండా మండలంలోని మిగిలిన గ్రామాల్లో కూడా రీసర్వేను కొనసాగించింది. అప్పటి ముఖ్యమంత్రి జగన్ బొమ్మలు లిఖించి సర్వేరాళ్లను ఏర్పాటు చేయడమే గాక పాసుపుస్తకాలపై జగన్ బొమ్మ ముద్రించి మంజూరు చేయడంపైనే నాటి ప్రభుత్వం దృష్టిసారించింది. వాస్తవానికి ప్రజలకు సర్వేతో మేలు జరగాలి. కానీ రీసర్వేతో ప్రజలు, రైతులలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సివచ్చింది. భూముల విస్తీర్ణం తగ్గడం, ఒకరి భూమిని మరొకరి పేరిట నమోదులు చేయడం, పాతసర్వే నెంబర్ల స్థానే ఎల్పీ నంబర్లు కేటాయించడంతో రిజిస్ట్రేషన్లు చేయించుకునే వారికి చిక్కులు ఏర్పడ్డాయి. ఆయా గ్రామాల్లో క్రయ విక్రయాలు చేసుకునేందుకు తీవ్ర అవరోధం ఏర్పడింది. బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న వాళ్ళు రీషెడ్యూల్ చేసుకోవడానికి వీలు లేకపోవడంతో రుణాలు మొత్తం చెల్లించాల్సిన దుస్థితి నెలకొంది.

చిక్కులు తీర్చాలని రైతుల మొర

ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసింది. రీసర్వే నిర్ణయం తీసుకోవడానికి నెల పాటు వేచి చూసింది. సర్వేను కొనసాగిస్తామని నిర్ణయించినా స్పష్టమైన విధివిధానాలు రాలేదు. దీనికితోడు మీ కోసం కార్యక్రమానికి సైతం రీసర్వే సమస్యలే ఎక్కువగా వస్తున్నాయి. ఈ క్రమంలో ప్రస్తుతం రీసర్వే జరిగిన గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి ఇబ్బందులు పడుతున్న వారి నుంచి అర్జీలు స్వీకరిస్తున్నారు. ఈ కార్యక్రమం జిల్లావ్యాప్తంగా మంగళవారం ఈ గ్రామసభల కార్యక్రమం ప్రారంభమైంది. మండలస్థాయి రెవెన్యూ అధికారులు, సర్వే విభాగం, మండల, సచివాలయ సిబ్బంది హాజరయ్యారు. ఏ విభాగానికి సంబంధించిన సమస్యను ఆ విభాగంలో అర్జీల రూపంలో స్వీకరించి పొందుపరుస్తున్నారు. విస్తీర్ణంలో తేడాలు, ఎల్‌పీ నెంబర్లలో తేడాలపై అధికంగా అర్జీలు వస్తున్నాయి. ఈ అర్జీలను ఎలా సరిచేయాలనే దానిపై ఇంకా ఆదేశాలు రాలేదని కాకినాడ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఒక తహశీల్దార్ పేర్కొనడం గమనార్హం. రీసర్వేతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నందున త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.



రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న వీఆర్వోలు

లోవలో భక్తుల కోలాహలం

తుని రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తలుపులమ్మ లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారి దర్శనార్థం తెలుగు రాష్ట్రాల నలమూలలనుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తులు వసత గదులు, వంట షెడ్లల్లో వంటా వార్పు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. ఆదివారం ఒక్కరోజు వివిధ విభాగాల ద్వారా ఆలయానికి రూ.5.33 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో విశ్వనాథరాజు తెలిపారు. వాహనాల రద్దీని క్రమబద్ధీకరణకు రూరల్ సీఐ చెన్న కేశవరావు బందోస్తు ఏర్పాటు చేశారు.

పెట్రోల్ బంకులో సోదాలు

కాకినాడ రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం ఇంద్రపాలెంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకులో ఆదివారం సాయంత్రం అధికారులు సోదాలు నిర్వహించినట్లు సమాచారం. ఈ బంకు నుంచి బౌజర్ వాహనం అనధికారికంగా డీజిల్‌ను తరలిస్తున్నట్లు గుర్తించిన అధికారులు సదరు వాహనం గురించి ఆరాతీశారు. దీనిపై వివరణ కోసం డీఎస్‌వో, డీటీలను ఫోన్‌లో సంప్రదించగా వారు స్పందించలేదు.

స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం

కాకినాడరూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ సమావేశహాల్లో స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ అసోషియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. సంఘ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుని ప్రమాణ స్వీకారోత్సవాన్ని నిర్వహించారు. అతిథులుగా డీఈవో పి.రమేష్, ఏడీ పి.నాగేశ్వరరావు, శ్రీరాం పాల్గొనగా సంఘ జిల్లా ప్రెసిడెంట్‌గా ఎంఆర్‌కుమార్, సహాధ్యక్షులుగా సురేష్ ఎన్నికయ్యారు.



సరిపోదా ఆదివారం!

కాకినాడ సండే బజారు.. తెల్లవారుజాము 4 గంటల నుంచే సందడి

గుండు సూది నుంచి గునపం వరకు.. కొత్తవి, పాతవి అన్నీ ఒకేచోట దొరికే మార్కెట్

ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలు, సైకిళ్లు.. అబ్బో ఇలా చాలా.. అన్నీ కారుచౌక ధరల్లోనే

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): గుండు సూది నుంచి గునపం వరకు.. పాత సైకిల్ నుంచి మోపెడ్ వరకు.. మిక్సీ నుంచి మోటార్స్ వరకు.. బ్రాండెడ్ వస్త్రాలను పోలిన దుస్తుల నుంచి అందమైన ఫ్లవర్‌వాస్‌ల వరకు ఇలా ఒక్కటేమిటి చెప్పుకుంటూపోతే వందల్లో వస్తువులు గుట్టలు.. గుట్టలుగా కనిపిస్తాయి. పేదవాడు నుంచి సామాన్య మధ్యతరగతి వరకు వారి కలలను తీరుస్తాయి. ఇదంతా ఎక్కడో హైదరాబాద్ కోటిబజార్ అనుకుంటున్నారా కాదు కాకినాడ సండే బజార్‌లోనే ఇవన్నీ దొరుకుతాయి. ఆదివారం వచ్చిదంటే చాలు కాకినాడ మెయిన్ రోడ్డు అంతా చిరు వ్యాపారులతో వినియోగదారులతో సందడిగా కనిపిస్తుంది. అంతేకాదు తిరునాళ్లను తలపిస్తుంది. ఇక్కడ రూపాయి నుంచి వందలు, వేలల్లో అందరికీ సరసమైన ధరల్లో అందుబాటులో ఉంటాయి. వస్తువు నాణ్యతనుబట్టి బేరం ఆడుకునే సౌకర్యం ఉంది. కొత్తవీ, పాతవీ అన్నీ ఉంటాయి.

తెల్లవారుజామునే మొదలు

కాకినాడ మెయిన్‌రోడ్డు ఎల్‌ఐసీ ఆఫీస్ నుంచి జగన్నాథపురం వంతెన వరకు ఈ సండేబజార్ జరుగుతుంది. ఆదివారం తెల్లవారుజామున 4గంటల నుంచి రాత్రి 10గంటల వరకు మెయిన్ రోడ్డంతా మార్కెట్‌లో సందడిగా ఉంటుంది. కొన్ని వస్తువుల వరకు తెల్లవారుజామున 3 గంటల నుంచి 5 గంటలు వరకు ప్రత్యేక బజారు ఒకటి నడుస్తుంది. ఇది ఉదయం 5 దాటితే క్లోజ్ అవుతుంది.

బ్రాండెడ్ వస్తువుల్ని తలపిస్తాయి..

ఇక్కడ బ్రాండెడ్ వస్తువులను పోలిన వస్తువులెన్నో లభిస్తాయి. దుస్తులు, షూస్, సైకిళ్లు, మోపెడ్స్ మిక్సీలు, గ్రైండర్లు, మొబైల్స్, గృహోపకరణాలు ఇలా ప్రతి వస్తువు బ్రాండెడ్‌తోపాటు నాన్ బ్రాండెడ్ కూడా ఉంటాయి. మార్కెట్‌లో సైకిళ్ల ధరకన్నా కొత్తవి కూడా చౌకగానే లభ్యమవుతాయి. పాత వస్తువులైతే వాటి కండీషన్‌ని బట్టి కొనుక్కోవచ్చు.

150 గ్రామాల నుంచి..

కాకినాడ పరిసర ప్రాంతాల్లోని సుమారు 150 గ్రామాల నుంచి ఈ సండేబజార్‌కు వివిధ రకాల వస్తువులు కొనుగోలుకు వ్యాపారులు, వినియోగదారులు తరలివస్తారు. యానాం, తాళ్లరేవు, ముమ్మిడివరం, ఎదురులంక వంటి గ్రామాలతోపాటు తుని, కోటనందూరు, అన్నవరం, కత్తిపూడి, గొల్లప్రోలు, చేబ్రోలు, పిఠాపురం, ప్రత్తిపాడు, సామర్లకోట, పెద్దాపురం వంటి పరిసర ప్రాంత ప్రజలంతా తెల్లవారుజామున 4 గంటలకే సండేబజార్‌కి వస్తుంటారు. కొన్ని వస్తువులు ఆ సమయంలో మాత్రమే దొరకడమే దానికి కారణం.

షోరూమ్‌లకు సెలవు కావడంతో..

నిత్యం రద్దీగా ఉండే మెయిన్ రోడ్డు ఆదివారం షోరూమ్‌లకు సెలవు కావడంతో సండేబజార్‌కి వెసులుబాటు లభించింది. దీంతో షోరూం వ్యాపారులతోపాటు హోల్‌సేల్ వ్యాపారులు కూడా సండేబజారులో తక్కువ ధరలకే వారి వద్ద ఉన్న బట్టలను, వస్తువులను ఇతరత్రా వాటిని విక్రయిస్తుంటారు. కంపెనీలో ఎక్స్‌పైరీ డేట్ దగ్గర పడుతున్న వస్తువులను కూడా ఇక్కడ తక్కువ ధరకు విక్రయిస్తారు. దీంతో సండేబజార్‌లో తక్కువ ధరలకే మంచి వస్తువులు దొరుకుతాయనే నమ్మకంతో ప్రజలు సండేబజారుపై ఎక్కువ ఆసక్తి చూపిస్తారు. ఉదాహరణకు షోరూమ్‌లో రూ.8 వేల నుంచి 10 వేలు పెట్టి కొనుగోలు చేసే సైకిల్ సండేబజారులో రూ.5వేలకే లభిస్తుంది. షోరూమ్‌లో రూ.వెయ్యి నుంచి రూ.2 వేలకు కొనుగోలు చేసే షూ ఇక్కడ రూ.200 నుంచి రూ.500కే లభిస్తుంది. సెకండ్ హ్యాండ్ మొబైల్స్ కంప్యూటర్ మౌస్‌లు, కీబోర్డులు ఇక్కడ తక్కువ ధరకే లభిస్తాయి. ఇంటి గృహోపకరణాలైతే చాలా తక్కువకే దొరికేస్తాయి.


బేరం కుదిరింది.. సైకిల్ బైక్ ఎక్కింది..


రేటు కారుచౌక.. రండిలా.. వస్త్ర దుకాణాల వద్ద రద్దీ


అన్ని సైజుల్లో వంట సామాన్లు.. విక్రయాలు జరుపుతున్న వ్యాపారి


పాతవే.. అన్నీ పనిచేసేవే.. సండేబజార్‌లో సెకండ్ హ్యాండ్ వస్తువులు


50.. 50.. 100.. ఏదైనా అదే ధర.. సండేబజార్ స్పెషల్


చింతూరు మండలంలో ఇంటింటా తిరుగుతూ యాచిస్తున్న గంగిరెద్దు, బసవయ్యలు

గంగిరెద్దుల.. జీవన యాత్ర!

- గంగిరెద్దుల వారికి ఇదే జీవనాధారం
- తరతరాలుగా ఇదే వృత్తితో జీవనం
- డోలు, సన్నాయిలతో కోలాహలం
- ప్రతి ఇల్లు సిరి సంపదలతో విరాజిల్లాలని దీవెన
- వారు మాత్రం పాత వస్త్రాలకే పరిమితం
- ఇదీ డూడూ బసవన్నల బతుకుపోరాటం



(చింతూరు-ఆంధ్రజ్యోతి)

గంగిరెద్దు.. నోరులేని మూగజీవి.. అయితేనేమి కొన్ని కుటుంబాలకు అదే జీవనాధారం. అందుకే వారికి గంగిరెద్దంటే ప్రాణంతో సమానం. వారు చిరిగిన వస్త్రాలు ధరించినా గంగిరెద్దుని మాత్రం నిత్య పెళ్లి కొడుకులా అలంకరిస్తారు. ఎందుకంటే అదే వారికి పెద్ద కొడుకంట. గంగిరెద్దు లేకుంటే తమకు జీవనమే లేదంటున్నారు. తరాలుగా తమ బతుకు ఇదేనంటున్నారు. పొట్టకూటి కోసం ఇల్లు, వాకిలి వీడి ఊరూరా తిరగాల్సిన దయనీయ స్థితి వారిది. అమ్మగారికి దండం పెట్టు.. అయ్యగారికి దండం పెట్టు అంటుంటే గంగిరెద్దు ఆడడం చూడముచ్చటగా ఉంటుంది. కృష్ణా జిల్లా తిరువూరు మండలం గానుగపాడులో పలు కుటుంబాలు గంగిరెద్లపై ఆధారపడి జీవిస్తున్నాయి. వారిలో కొన్ని కుటుంబాలు ఏటా చింతూరు ఏజెన్సీకి వస్తాయి. ఈసారి సుమారు పది కుటుంబాలు ఇక్కడికి వచ్చాయి. దసరా నుంచి సంక్రాంతి వరకు ఆ కుటుంబాలు ఇక్కడి ప్రతి పల్లెల్లో తిరుగుతాయి. ఈ క్రమంలో ఎవరికి తోచింది వారికి ఇస్తుంటారు. రైతులు చేటలో ధాన్యం పోసి గంగిరెద్దుకు తినిపిస్తారు. అలా చేస్తే పంటలు బాగా పండుతాయని వారి నమ్మకం. ఇంట్లోని పాత వస్త్రాలను గంగిరెద్దు అలంకరణకు ఇస్తారు. రైతులు చేసిన దాన, ధర్మాలకు సంతోషం వ్యక్తం చేస్తూ బసవన్నలు దొరగారి ఇల్లు సిరి సంపదలతో కళకళలాడాలని దీవిస్తాయి. కాగా బసవయ్యల బతుకులు మాత్రం చిరిగిన వస్త్రాల వద్దే ఆగిపోతుంటాయి. ఊరూరా ప్లాస్టిక్ టార్పాలిన్లతో డేరాలు వేసుకొని అక్కడే వంట-వార్పు చేసుకుంటారు. చిమ్మచీకట్లోనే వారి కాపురం. వేకువనే మకాం నుంచి బయల్దేరి మధ్యాహ్నం వరకు ఇంటింటా యాచించడం వారి జీవన శైలి. ఇదంతా ఒక ఎత్తయితే గంగిరెద్దుకు శిక్షణ ఇప్పించడం మరో ఎత్తు. మంచి జాతి గిత్తని ఎంచుకోవడం మొదటిది. తర్వాత ప్రకాశం జిల్లా రాజనెల్లూరులో గంగిరెద్దులకు శిక్షణ ఇచ్చే గురువు వద్దకు తీసుకెళ్లాల్సి ఉంటుంది. శిక్షణ ఇచ్చేందుకు గురువుకు దక్షిణ ఇచ్చుకోవాల్సి ఉంటుంది. ఒకింత స్థాయిని మించి (సుమారు రూ.25వేల దాకా) దక్షిణ ఉన్నప్పటికీ తప్పని స్థితి. శిక్షణ రెండు నెలల నుంచి ఒక్కోమారు ఏడాది కూడా ఇవ్వాల్సి ఉంటుంది. తరతరాలుగా ఇదే తమ జీవితం కావడంతో ఊరూరా కాలినడకన తిరిగి తిరిగి మోకాళ్లు అరిగిపోయి చివరకు నడవడానికి ఓపిక లేని స్థితిలో అవస్థలు పడుతుంటామని బసవయ్యలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అయినా ఈ వృత్తి తప్ప తమకు మరో దారి లేదంటున్నారు. ఏడాదిలో మూడు నుంచి నాలుగు నెలలపాటు పల్లెల్లో యాచించి మిగిలిన కాలంలో తమ ఊరిలో కూలి పనులకు వెళ్తామంటున్నారు. తమ కుటుంబాల్లో ఉద్యోగం చేసేవాళ్లే లేరని నిరాశ చెందుతున్నారు. ఆ భాగ్యం వారికెప్పుడు కలుగుతుందో మరి.



చింతూరులో వారి వలస గుడారాలు.. గంగిరెద్దులతో నడిచి నడిచి కాళ్లు వంకర్లు పోయిన దృశ్యం

యానాంలో ఘనంగా 'కవిసంధ్య' స్వర్ణోత్సవ సభ


కవిసంధ్య కవిత్వ పత్రిక తొలి సంచికను ఆవిష్కరిస్తున్న పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు


శిఖామణి సాహితీ పురస్కారాన్ని వాడ్రేవు చిన వీరభద్రుడు, యువ పురస్కారం పాయల మురళీకృష్ణకు అందజేసి సత్కరిస్తున్న దృశ్యం

- కవిసంధ్య తొలి స్వర్ణోత్సవ సంచిక ఆవిష్కరణ
- శిఖామణి సాహితీ, యువ పురస్కారం అందజేత

యానాం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): యానాం కేంద్రంగా వెలువడుతున్న కవిసంధ్య, కవిత్వపత్రిక స్థాపించి 50 సంచికలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో స్వర్ణోత్సవ సభను నిర్వహించారు. కవిసంధ్య సాహితీ సాంస్కృతిక సంస్థ యానాం-హైదరాబాద్ నిర్వహణలో ఇది జరిగింది. ఆదివారం ఉదయం కామిశెట్టివారి వీధిలోని గీతాభవన్‌లో కవిసంధ్య అధ్యక్షుడు శిఖామణి, పురస్కార కమిటీ అధ్యక్షుడు దాట్ల దేవదానం రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఆత్మీయ అతిథులుగా డాక్టర్ దీర్ఘాశి విజయ్ భాస్కర్, డాక్టర్ సి.మృణాళిని, డాక్టర్ వీరలక్ష్మీదేవి, ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి మంగేష్, డాక్టర్ ఆర్.సీతారాం తదితరులు హాజరయ్యారు. ముఖ్యఅతిథులను నిర్వాహకులు సత్కరించారు. ఈ సందర్భంగా మల్లాడి మాట్లాడారు. కవితా సదస్సులు నిరంతరం కొనసాగాలని, అందుకు కావాల్సిన సహకారం ఉంటుందని అన్నారు. ప్రస్తుతం ఇస్తున్న పురస్కారం వచ్చేఏడాది నుంచి పెంచాలని, మహిళలకు ప్రత్యేకంగా పురస్కారం ఇవ్వాలని, ఇందుకు పెంచిన మొత్తం ఇస్తానని వెల్లడించారు. కవులు తక్కువ మందే ఉండవచ్చు కానీ వారు రాసిన కవితలు, కథల ప్రభావం లక్షలాది మందిపై ఉంటుందన్నారు. ఇటువంటి కార్యక్రమాలు కొంతభారం అనిపించినా ఇతరుల సహకారం ఉంటే మరికొంతమంది ముందుకు వచ్చి మరికొన్ని కార్యక్రమాలు నిర్వహించేందుకు అవకాశాలు ఉంటాయన్నారు. శిఖామణి సాహితీ పురస్కారం-2024కు ప్రముఖ కవి, విమర్శకులు, అనువాదకుడు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత వాడ్రేవు చినవీరభద్రుడు మాట్లాడారు. శిఖామణితో 35 ఏళ్ల అనుబంధమన్నారు. తనకు సమ వయస్కుడైన కవి తన పేరుమీద పురస్కారం ఇవ్వడానికి ఎంతో ఔదార్యం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కవులు మధునాపంతుల సత్యనారాయణమూర్తి, డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి, మురళీశంకర్, సుంకర గోపాల్, బొల్లోజు బాబా, సీహెచ్ రాం, అశోక్ పాల్గొన్నారు.

కవిసంధ్య ప్రతిభా పురస్కార గ్రహీతలు వీరే

ఈ సందర్భంగా 13మంది (వచన, అభ్యుదయ, పత్రికా, లఘు కవిత, దళిత సాహిత్యం)కి ముఖ్యఅతిథులు కవిసంధ్య ప్రతిభా పురస్కారాలు అందజేశారు. వీరిలో కొమ్మవరపు విల్సన్ రావు, కపిల రాంకుమార్, పోనుగుమట్ల విష్ణుమూర్తి, ఎస్.ఈశ్వర రెడ్డి, కాళ్లకూరి శైలజ, జీవీ రత్నాకర్, మార్ని జానకిరామచౌదరి, మోకా రత్నరాజు, సరికొండ నరసింహరాజు, కోలాటి పెద్దిరాజు, కొండూరి రమరాజు, పీవీ రమణ, ఎస్వీ రామశాస్త్రి ఉన్నారు.

కవిసంధ్య తొలి, స్వర్ణోత్సవ సంచిక ఆవిష్కరణ

కవిసంధ్య కవిత్వ పత్రిక తొలి సంచికగా యుగకర్త కందుకూరి వీరేశలింగం పంతులు ముఖచిత్రంతో 16 పేజీల పత్రికను, కవిసంధ్య 136 పేజీలతో స్వర్ణోత్సవ సంచికను ముఖ్యఅతిథి పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఆవిష్కరించి అతిథులకు అందజేశారు. శిఖామణి మలయాళ కవిత్వం సంచికను ప్రముఖ కవి డాక్టర్ ఆర్.సీతారం ఆవిష్కరించారు. కవిసంధ్య డిజిటలైజేషన్‌ను వక్తలు అవిష్కరించారు.

శిఖామణి సాహితీ, యువ పురస్కారం

ప్రతిఏటా సాహిత్యంలో జీవనసాఫల్య కృషికి ఇచ్చే శిఖామణి సాహితీ పురస్కారం-2024కు వాడ్రేవు చిన వీరభద్రుడు, కవిత్వంలో యువ కవులకు ఇచ్చే శిఖామణి యువ పురస్కారం-2024కు యువకవి, విమర్శకుడు, విజయనగరం తెలుగు అధ్యాపకుడు పాయల మురళీకృష్ణకు అందజేశారు. అవార్డులో పదివేల నగదు, మెమొంటో, సన్మాన పత్రాలను అందజేశారు.

బ్రదర్...డ్యాన్స్ సూపర్

తుని డిపో బస్సు కాంట్రాక్ట్ డ్రైవర్ డ్యాన్స్ నెట్టింట వైరల్

ప్రశంసిస్తూ 'ఎక్స్'లో మంత్రి లోకేశ్ ట్వీట్

ఉద్యోగానికి రావొద్దంటూ డిపో సీఐ మౌఖిక ఆదేశాలు!

తుని రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని ఆర్టీసీ డిపో కాంట్రాక్ట్ డ్రైవర్ నేతల లోవరాజు డ్యాన్స్‌కు మంత్రి లోకేశ్ ఫిదా అయ్యారు. విద్యార్థుల ప్రత్యేక బస్సు వెళ్తుండగా ఆ దారిలో ఓ భారీ వాహనం అడ్డువచ్చి గంటసేపు ఆగిపోవాల్సి వచ్చింది. ఈ మధ్యలో అతడు దేవర సినిమా పాటకు డ్యాన్స్ వేసి విద్యార్థులను ఉర్రూతలూగించాడు. మూడు రోజుల క్రితం జరిగిన ఈ సంఘటన నెట్టింట వైరల్‌గా మారింది. మంత్రి లోకేశ్ కూడా డ్రైవర్ డ్యాన్స్‌ను మెచ్చుకుంటూ ట్వీట్ చేశారు. దీంతో డ్రైవర్ లోవరాజు ఎనలేని ఆనందం పొందాడు. కానీ, ఆ డ్రైవర్ విధి నిర్వహణలో అలక్ష్యం వహించాడని భావించిన డిపో సీఐ అతడిని డ్యూటీకి రావొద్దంటూ మౌఖికంగా ఆదేశాలు ఇచ్చినట్టు సమాచారం.


డ్రైవర్ లోవరాజు

కాకినాడ జిల్లా తుని డిపోలో లోవరాజు డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మూడు రోజుల క్రితం అతడు రౌతులపూడి నుంచి స్కూల్, కాలేజ్ విద్యార్థులను ఎక్కించుకుని తునికి వస్తున్నాడు. ఆ మార్గం సింగిల్ రోడ్డు కావడంతో కోడూరు సమీపంలో బస్సుకు ఎదురుగా భారీ వాహనం నిలిచిపోయింది. దీంతో బస్సు ముందుకు వెళ్లలేక వెనక్కి రాలేని పరిస్థితి ఏర్పడింది. భారీ వాహనాన్ని కదిలించేందుకు గంటకు పైగా సమయం పడుతుందని తెలియడంతో బస్సులోని విద్యార్థులను ఎంటర్‌టైన్ చేయాలనుకున్న డ్రైవర్ బస్సుకు ఎదురుగా దేవర సినిమా పాటకు డ్యాన్స్ వేశాడు. దాన్ని వీడియో తీసిన విద్యార్థులు వైరల్ చేయడంతో లోవరాజు టాలెంట్ మంత్రి దృష్టికి వెళ్లగా ఆయన అభినందిస్తూ శనివారం రాత్రి 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. కాగా, డ్రైవర్ విధి నిర్వహణలో అలక్ష్యం వహిస్తూ ప్రయాణికులను నిర్లక్ష్యం చేస్తున్నాడంటూ కొందరు ఈ వీడియోను వైరల్ చేశారు. కొన్ని లోకల్ పత్రికల్లో దీనిపై వార్తలు ప్రచురితమయ్యాయి. ఇవి గమనించిన తుని డిపో సీఐ అతడిని డ్యూటీకి రావొద్దంటూ ఆదేశాలు ఇచ్చారని తెలిసింది. వాస్తవానికి అది విద్యార్థుల స్పెషల్ బస్సు మాత్రమేనని, ఈ ఘటన సమయంలో ఆ మార్గంలో వాహనం గంటసేపు ఆగిపోయిందని, అప్పుడే డ్రైవర్ డ్యాన్స్ వేశాడని తెలిసింది. దీనిపై డిపో డీఎంను ప్రశ్నించగా అతడు కాంట్రాక్ట్ డ్రైవర్ మాత్రమేనని, అతడిని సస్పెండ్ చేసే అవకాశం లేదని, అలా చేసినట్టు వస్తున్న వార్తల్లో నిజం లేదన్నారు.



మూడురోజులక్రితం బస్సు ఎదురుగా డ్యాన్స్ చేస్తున్న డ్రైవర్ లోవరాజు

దివాన్‌చెరువుకు చేరిన అయ్యప్పభక్తుల

శబరిమల సైకిల్‌యాత్ర

దివాన్‌చెరువు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అయ్యప్పమాల ధరించిన కాకినాడ జిల్లాలోని తుని, కోటనందూరు మండలాలకు చెందిన ఐదుగురు భక్తులు శబరిమలకు సైకిల్ యాత్ర చేపట్టారు. జాతీయ రహదారి మీదుగా ప్రయాణిస్తూ ఆదివారం దివాన్‌చెరువుకు చేరుకున్న తుని మండలం డి.పోలవరానికి చెందిన బండారు రవి గురుస్వామి, స్వాములు చింతల ప్రసాద్, మదనాడ సాయి, కోటనందూరు మండలం బిళ్లనందూరుకు చెందిన రుత్తల దుర్గాప్రసాద్, బొత్స నాగేశ్వరరావులను ఆంధ్రజ్యోతి పలకరించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 26న నుంచి సైకిల్ యాత్ర ప్రారంభించామన్నారు. రోజుకు వంద కిలోమీటర్ల చొప్పున యాత్ర సాగించి వచ్చేనెల 15కి చేరుకుంటామన్నారు. తొలిరోజైన శనివారం మధ్యాహ్నం సమయంలో యాత్ర ప్రారంభించామన్నారు. ఆదివారం నుంచి రోజుకు 100 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేస్తామన్నారు. రోజూ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 వరకు యాత్ర సాగించి మార్గమధ్యలోని స్వాముల పీఠాల వద్ద హారతులు ఇస్తామన్నారు. రాత్రి సమయంలో స్వాముల పీఠాల వద్ద బస చేస్తున్నామని చెప్పారు. ఈ యాత్రలో తాము విజయవాడ, తిరుపతి, శ్రీశైలం, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, అరుణాచలం, పళని, ఎరుమేళిలను సందర్శిస్తామన్నారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటూ పంబ వరకూ సైకిల్ యాత్ర సాగిస్తామన్నారు. అక్కడి నుంచి నడక మార్గాన శబరిమల చేరుకుని అయ్యప్పస్వామిని దర్శించుకుంటామని తెలిపారు.

ఇరుముడితో విమాన ప్రయాణంపై హర్షం: అయ్యప్ప భక్తులు ఇరుముడితో విమానంలో ప్రయాణాన్ని సులభతరం చేయడంపై టీడీపీ రాష్ట్ర బీసీ సాధికార సమితి డైరెక్టరు వంకమల్లికార్జునస్వామి (మల్లిబాబు) హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కేంద్ర విమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన నాయుడు తీసుకున్న ఈ నిర్ణయం వల్ల ఇరుముడిని సౌలభ్యంగా తీసుకు వెళ్లడానికి వీలు కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.


శబరిమలకై సైకిల్ యాత్ర చేస్తున్న అయ్యప్పస్వాములు



కొత్త బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

కొత్త బస్సులు ప్రారంభం

అన్నవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానం రూ.82లక్షలతో నూతనంగా కొనుగోలు చేసిన రెండు బస్సులను ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం తరపున సహాయ సహకారాలు అందించేందుకు తానెప్పుడూ సిద్ధమని చెప్పారు. కార్యక్రమంలో ఈవో రామచంద్రమోహన్, చైర్మన్ ఐవీ రోహిత్, కూటమి నాయకులు పాల్గొన్నారు.



ప్రధానాలయం ముందు సత్యదీక్షాపరులు

సత్య దీక్షలు ఆరంభం

అన్నవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి అత్యంత ప్రీతికరమైన సత్య దీక్షలను ఆదివారం భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. వేకువజామున శిరస్నానం చేసి పసుపు రంగు వస్త్రాలు ధరించి మాలలు వేసుకున్నారు. అడ్డతీగలలో పవనగిరి స్వామీజీ 600 మంది గిరిజనులు, ప్రత్తిపాడు, జగ్గంపేట మండలాల్లో ప్రచారకర్త కృష్ణబాబు ఆధ్వర్యంలో ప్రజలు, రత్నగిరి ఉద్యోగులు, అన్నవరంలో గ్రామస్తులు దీక్ష తీసుకున్నారు. మహిళల కోసం 18 రోజుల దీక్షను వచ్చే నెల 6వ తేదీన, 9 రోజుల దీక్షను 14న తీసుకుంటారు. 23న ఇరుముడి సమర్పణతో విరమిస్తారు.

కార్తీక మాసోత్సవాలకు సిద్ధం

భక్తులకు సౌకర్యాల కల్పనపై ప్రత్తిపాడు ఎమ్మెల్యే అధ్యక్షతన పలు శాఖల అధికారులతో అన్నవరం దేవస్థానం ఈవో, చైర్మన్ రోహిత్ సమీక్ష

అన్నవరం, అక్టోబరు 27: కార్తీక మాసంలో సత్యదేవుని సన్నిధికి లక్షలాదిగా విచ్చేసే భక్తులకు సౌకర్యాల కల్పన, తెప్పోత్సవం, గిరిప్రదక్షణలపై ఆదివారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అధ్యక్షతన ఈవో, చైర్మన్, పోలీసు, రెవెన్యూ ఇతర శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈవో రామచంద్రమోహన్ మాట్లాడుతూ పర్వదినాల్లో వ్రతం టిక్కెట్ల కౌంటర్‌ను రాత్రి 10 గంటలకు ప్రారంభించి 12 గంటల నుంచి వ్రతాలు, ఒంటి గంట నుంచి సర్వదర్శనాలను ప్రారంభిస్తామన్నారు.

- ఎటువంటి తొక్కిసలాట జరగకుండా తిరుమలలో మాదిరిగా కంపార్ట్‌మెంట్, క్యూలైన్లలో భక్తులు కూర్చునేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.
- రూ.1.43 కోట్లతో పర్మినెంట్, తాత్కాలిక సదుపాయాలు సమకూర్చామన్నారు. పర్వదినాల్లో సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బందిని అదనంగా నియమించామన్నారు. మిగిలిన కార్యకలాపాలకు సింహాచలం దేవస్థానం నుంచి పలువురు ఉద్యోగులను డిప్యుటేషన్‌పై తీసుకుంటామన్నారు. ప్రధాన మార్గాల్లో సమాచార కేంద్రాలు, భక్తులు అధికంగా ఉండేచోట్ల మరుగుదొడ్లు, స్నానపు గదులు తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. రూ.300 వ్రతం భక్తులకు 9 మండపాలు సిద్ధం చేయగా... ఏక కాలంలో సుమారు 3,500 వ్రతాలు జరిగేలా చర్యలు తీసుకున్నామన్నారు.
- కార్తీక పౌర్ణమి రోజైన నవంబరు 15వ తేదీ ఆచార సంప్రదాయలను గౌరవిస్తూ ఉదయం 7.30 గంటలకు పల్లకిలో స్వామి, అమ్మవార్లకు గిరి ప్రదక్షిణ చేయిస్తామన్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు సత్య రథంతో భక్తులతో గిరి ప్రదక్షిణ నిర్వహిస్తామన్నారు. తద్వారా దర్శనాలు, వ్రతాలు చేయించుకునే భక్తులు, గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తుల తాకిడి తగ్గి స్వామిని ప్రశాంతంగా దర్శించుకునే వీలుంటుందన్నారు.
- సత్యగిరి నుంచి రత్నగిరికి చేరుకునే వారికి ఉచిత వాహన సౌకర్యం కల్పిస్తామన్నారు. ఇప్పటికే ఉచిత బస్సులు తిరుగుతుండగా టాటా మ్యాజిక్ వాహనాలను అదనంగా అందుబాటులో ఉంచుతామన్నారు. కొండ దిగువ నుంచి, రైల్వే స్టేషన్ నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతామన్నారు..
- గిరిప్రదక్షిణ మార్గంలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని ప్రత్తిపాడు సీఐ సూరి అప్పారావు కోరగా ఈవో అంగీకరించారు. భక్తులు బసచేసే ప్రదేశాలు, అధికంగా సంచరించే ప్రాంతాల్లో అధిక నిఘా పెడతామని, దేవస్థానం సహకరించాలని కోరారు.
- కొండ దిగువన మెయిన్‌రోడ్డు ఆక్రమణకు గురికాకుండా, దుకాణ సముదాయాలు రోడ్డుపైకి రాకుండా, ట్రాఫిక్‌కి ఇబ్బం ది లేకుండా చూస్తామని రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, పంచాయతీ శాఖ అధికారులు తెలిపారు.
- నిరంతరం బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను, అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్‌శాఖ అధికారులను, కొండ దిగువ, కొండపైన, సత్యగిరిపై ప్రత్యేక మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను కోరారు.
- తెప్పోత్సవానికి పంపా సరోవరంలో తగినంత నీటి నిల్వలు ఉండేలా చూడాలని, లైఫ్ జాకెట్లు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని ఇరిగేషన్ అధికారులను ఈవో కోరారు.
- అన్ని శాఖల అధికారులూ సమన్వయంతో ఉండి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఎమ్మెల్యే సత్యప్రభ సూచించారు. సమావేశంలో దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, ఆర్డీవో శ్రీరమణి, అన్నవరం ఎస్ఐ హరిబాబు, దేవస్థానం ఇంజనీరింగ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఈవో, చైర్మన్, వివిధ శాఖల అధికారులు





ఉత్సవమూర్తులను అభిషేకిస్తున్న అర్చకస్వాములు, కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే సత్యానందరావు దంపతులు

కల్యాణం కమనీయం

- ఏడవ రోజుకు వాడపల్లి వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలు
- స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే బండారు దంపతులు
- రాజాధిరాజ అలంకరణలో శ్రీవారు
- గజవాహన సేవలో పాల్గొన్న భక్తులు

ఆత్రేయపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి 12వ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఏడవ రోజైన ఆదివారం లోక కల్యాణార్థం శ్రీనివాసుని కల్యాణం రమణీయంగా జరిగింది. స్వామివారి మూల విరాట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీవారిని స్వర్ణశోభితుడిని చేసి పుష్పాలతో అలంకరించారు. వసంత మండపంలో ఉత్సవ మూర్తులు కొలువుదీరారు. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవల్లి వరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేద పండితులు, అర్చకులు సంకల్పం, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పంచామృత మంటపారాధన, మహాస్నపనం, ప్రధాన హోమాలు జరిపారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు-కమలారాణి దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. జగత్ కల్యాణార్థం స్వామివారి కల్యాణాన్ని ఎమ్మెల్యే బండారు దంపతులు, ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు-కనకదుర్గాదేవి దంపతులు జరిపించారు. వేదమంత్రాలు, మేళతాళ మంగళ వాయిద్యాలు, భక్తుల గోవిందనామస్మరణ నడుమ మంగళసూత్ర ధారణ, తలంబ్రాల తంతును కనులారా వీక్షించిన భక్తులు తన్మయత్వం పొందారు.

ఆదివారం రాత్రి శ్రీవారు రాజాధిరాజ అలంకరణలో గజవాహనంపై ఆశీనులై తిరువీధుల్లో విహరించారు. వేదఘోష, మంగళవాయిద్యాలు, బాణసంచాకాల్పుల నడుమ శ్రీవారు భక్తులకు అభయహస్తం అందించారు. ముదునూరి వెంకట్రాజు-సత్యశ్రావణి దంపతులు, కాయల జగన్నాథం-మంగాదేవి దంపతులు పాల్గొన్నారు.

కేరళ వాయిద్యాలు, మహారాష్ట్ర వాయిద్యం, హనుమాన్ వేషధారణ, మహిళల ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పుష్పాలతో అలంకరించిన ఫొటో షూట్ వద్ద భక్తులు సందడి చేశారు. ఫల, పుష్ప, విద్యుత్ అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

వాడపల్లిలో నేడు ...

బ్రహ్మోత్సవాల్లో 8వ రోజైన సోమవారం తోమాల సేవ, మహా సుదర్శన హోమం, కల్పవృక్ష వాహనసేవ, చూర్ణోత్సవం, రాత్రి కల్కి అలంకరణలో అశ్వ వాహన సేవ.



రాజాధిరాజ అలంకరణలో శ్రీవారు



గజవాహన సేవలో పాల్గొన్న భక్తులు

మూవీ ఆర్టిస్ట్స్‌అసోసియేషన్ లోగో ఆవిష్కరణ

పోర్టు సిటీ (కాకినాడ), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ లోగోను కాకినాడ వెంకటరత్నపురంలోని దంటు కళా క్షేత్రంలో ప్రముఖ సినీ నటుడు గౌతంరాజు, కాకినాడ నగర సాహితీ స్రవంతి అధ్యక్షుడు మార్ని జానకిరామ్‌చౌదరి ఆదివారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గౌతంరాజు మాట్లాడుతూ రాష్ట్రం విడిపోయిన తర్వాత కొత్తగా అసోసియేషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని చెప్పారు. ఇందులో భాగంగా 2021లో రిజిస్ట్రేషన్ చేయించామన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో నటులందరికీ ఇళ్ల స్థలాలు, వైద్య సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో డబ్బింగ్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఇన్‌చార్జి ఎం.సురేష్, జయకుమార్, కర్నాటి శ్రీనివాస్, వర్మ, వాసు, చంద్రరావు, గవర్రాజు, యంగ్మెన్స్ హ్యాపీ క్లబ్ సంయుక్త కార్యదర్శి నాదెళ్ల ప్రభుదాస్, రాష్ట్రంలో పలు జిల్లాల నుంచి వచ్చిన ప్రతినిధులు పాల్గొన్నారు.



లోగోను ఆవిష్కరిస్తున్న ప్రముఖ సినీ నటుడు గౌతంరాజు



స్వాధీనం చేసుకున్న మోటారు సైకిళ్లు

జి.మేడపాడు శివారులో పేకాట శిబిరంపై పోలీసుల దాడి

21 మంది అరెస్టు

రూ.84,500 నగదు స్వాధీనం

సామర్లకోట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మండలం జి.మేడపాడు శివారున పెద్ద ఎత్తున పేకాట శిబిరం నిర్వహిస్తున్నారన్న సమాచారంతో సామర్లకోట పోలీసులు ఆదివారం రాత్రి అకస్మికంగా దాడులు చేశారు. పేకాడుతున్న 21 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.84,500 స్వాధీనం చేసుకున్నారు. 15 మోటారు సైకిళ్లు, 15 సెల్‌ఫోన్లు కూడా స్వాధీనం చేసుకున్నారు. జి.మేడపాడులో ఒక రాజకీయ పార్టీకి చెందిన ప్రముఖుడి అతిథి గృహంలో కొంత కాలంగా పేకాట జరుగుతోంది. నిర్వాహకులు, స్థానికులు మధ్య నెలకొన్న వివాదం నేపథ్యంలో అందిన సమాచారంతో పోలీసులు దాడి చేశారు. పట్టుబడిన వారిలో అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు వున్నారు.

కమిటీ వేశాం... సమస్యలు పరిష్కరిస్తాం

అస్సాగో ఇథనాల్ పరిశ్రమ కాలుష్య కారకాలపై నిజ నిర్ధారణ చేస్తాం

గుమ్మళ్లదొడ్డిలో పర్యటించిన తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి

వేరేచోటకు తరలించాలని వేడుకున్న స్థానికులు

గోకవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డిలో అస్సాగో ఇథనాల్ పరిశ్రమ ద్వారా తలెత్తుతున్న ఇబ్బందుల తొలగింపునకు తగిన చర్యలు తీసుకుంటామని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కాలుష్యకారక పరిశ్రమను తరలించాలని డిమాండు చేస్తూ ఐదు రోజులు నిరవధిక దీక్ష చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పరిశ్రమ సమీపంలో ఉన్న ఎస్సీ పేటలో కలెక్టర్ ఆదివారం కలియతిరిగారు. పరిశ్రమ నుంచి వస్తున్న దుర్వాసన, శబ్దాలను తెలుసుకునే ప్రయత్నం చేశారు. అనంతరం రామాలయం వద్దకు చేరుకుని దీక్ష చేస్తున్న కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి మరోతి శివగణేష్, సామాజిక ఉద్యమనేత పాటంశెట్టి సూర్యచంద్ర, ఆమె సతీమణి శ్రీదేవి, బాధితులతో మాట్లాడారు. అధికారులు, స్థానికులతో కూడిన ఓ కమిటీని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఇందులో పి.ప్రదీప్‌కుమార్ (పరిశ్రమల శాఖ సహాయ సంచాలకుడు), ఆర్.త్రినాథ్, శేఖర్ (పరిశ్రమల తనిఖీ విభాగం), జి.స్వాతి (పర్యావరణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్), గ్రామస్తుల తరపున సీహెచ్ చినబాబు, బూలా అబ్బులు, ఎ.కృష్ణప్రసాద్, రెడ్డి నారాయణ, పెద్ది నాగలక్ష్మి వున్నారు. వారంతా పరిశ్రమ లోపల, బయట ఏం జరుగుతోందో తెలుసుకుంటారని చెప్పారు. ఏఏ పదార్థాలను వినియోగిస్తున్నారు... తద్వారా వచ్చే వ్యర్థ పదార్థాలు, వ్యర్థ నీటిని బయటకు తరలించేందుకు యాజమాన్యం ఏఏ చర్యలు చేపట్టిందో కమిటీ ద్వారా బహిర్గతమవుతుందన్నారు. పరిశ్రమ నుంచి దుర్వాసన వస్తోందా, వస్తే ఎంతమేర వెదజల్లుతుందో కమిటీ నిజ నిర్ధారణ చేస్తుందన్నారు. కమిటీ ఇచ్చిన నివేదిక ద్వారా పరిశ్రమ నిర్వాహకులపై తదుపరి చర్యలు ఉంటాయని కలెక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు.

కాగా కలెక్టర్ వస్తున్నారని సమాచారం తెలుసుకున్న గుమ్మళ్లదొడ్డి, అచ్యుతాపురం, బావాజీపేట, వెదురుపాక గ్రామాలకు చెందిన వందలాది మంది ప్రజలు గుమ్మళ్లదొడ్డి చేరుకున్నారు. ఇథనాల్ పరిశ్రమ వల్ల పడుతున్న ఇబ్బందులను ఆమెకు స్వయంగా తెలియజేయాలనే కుతూహలాన్ని ప్రదర్శించారు. ఇప్పటికే అనేక మంది రోగాలబారిన పడ్డారని బాధితులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. జనావాసాల మధ్య ఏర్పాటుచేసిన పరిశ్రమను తక్షణం వేరే ప్రాంతానికి తరలించాలని కలెక్టర్‌ను వేడుకున్నారు.

కాగా తాము ఐదు రోజులుగా ఆందోళన చేస్తున్నా స్థానిక ఎంపీటీసీ పత్తా లేకుండా పోయారంటూ గ్రామస్తులు మండిపడ్డారు. కలెక్టర్ పర్యటన ముగిసిన అనంతరం అక్కడే ఉన్న ఎంపీటీసీ కోట సత్యవతిపై స్థానికులు తిరగబడ్డారు. పరిశ్రమ నిర్వహణను వ్యతిరేకిస్తూ ఉద్యమం చేస్తుంటే మీరు ఏమయ్యారని నిలదీశారు. అక్కడే ఉన్న పోలీసులు జోక్యం చేసుకుని ఎంపీటీసీని ఇంటికి పంపించేయడంతో వివాదం సద్దుమణిగింది.



గుమ్మళ్లదొడ్డి గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి



ఎంపీటీసీ సత్యవతిని చుట్టుముట్టిన స్థానికులు



కూనవరం క్రాస్‌రోడ్డు దగ్గర వాహనాలు వెళ్లకుండా పహారా కాసిన పోలీసులు, ఫారెస్టు అధికారులు

అదిగో పులి

బురదగూడెం పరిధిలో కనిపించిందన్న

వీఆర్ పురం వాసులు

కూనవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇన్ని రోజులూ అడవిలో తిరిగిన పులి ఇప్పుడు బాహ్య ప్రపంచంలోకి అడుగుపెట్టింది. బురదగూడెం వద్ద పులి రోడ్డు దాటుతూ కనిపించిందని వీఆర్ పురం మండల వాసులు అటవీ శాఖ అధికారులకు తెలియజేశారు. దీంతో కూనవరం మండలంలో పులి తిరుగుతోందనేది వాస్తవమైంది. రాత్రి వేళలో చింతూరు, కూనవరం ఎటువంటి వాహనాలు తిరగకుండా ఎస్ఐ లతాశ్రీ, డీఎఫ్‌వో భవిత కూనవరం క్రాస్‌రోడ్డు వద్ద ఆదివారం అర్ధరాత్రి పహారా కాశారు. పోలీసులు, ఫారెస్టు అధికారులు ఎటువంటి వాహనాలు వెళ్లకుండా అడ్డుకున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు.

బాలబాలాజీకి తిరుమంజన సేవ

అప్పనపల్లిలో రెండో రోజుకు పవిత్రోత్సవాలు

మామిడికుదురు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాల బాలాజీ ఆలయంలో పవిత్రోత్సవాలు ఆదివారం రెండో రోజుకు చేరుకున్నాయి. స్వామివారికి పంచామృతాలతో తిరుమంజన సేవను ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో పాటు పలు పూజలు జరిపారు. 27 కలశలతో పంచామృతాలు, పదకొండు రకాల పండ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలు, ఉద్గ జలాలతో స్నపన తిరుమంజన సేవ వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ సహాయ కమిషనరు ఎం.సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో మునుపెన్నడూ లేని విధంగా పవిత్రోత్సవాలను కనుల పండువగా నిర్వహిస్తున్నారు. అధిక సంఖ్యలో భక్తులు వీక్షించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం వివిధ ఆర్జిత సేవలు, టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.1,586,949 ఆదాయం వచ్చిందని సహాయ కమిషనరు తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బంది కలగకుండా ఈవో, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.







స్వామివారికి అభిషేకం చేస్తున్న అర్చకులు , హోమం జరిపిస్తున్న వేద పండితులు

సైసై జోడెడ్లా బండి





ఈ ఫొటోని చూస్తే జోడెడ్లు వెళ్తున్నట్టు ఉంది కదూ... కానీ ఇవి నిజం ఎద్దులు కావు. కాకినాడ జిల్లా పరిషత్ సెంటరు నుంచి ఇంద్రపాలెం వైపు ఓ వాహనంపై వెళ్తున్నాయి. వెనుక భాగంలో ఆవు, దూడ ఉన్నాయి. వీటిని ఓ శుభ కార్యక్రమంలో ప్రదర్శనకు ఉంచేందుకు తీసుకెళ్తున్నారు. ఆకర్షణీయంగా ఉన్న ఈ రథాన్ని అటుగా వెళ్తున్న వారు ఆసక్తిగా తిలకించారు. మరికొందరైతే సెల్ఫీలు కూడా తీసుకున్నారు.

ఆంధ్రజ్యోతి- సర్పవరం జంక్షన్ (కాకినాడ)

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం



ఆటస్థలమిలా.. ఆడేదెలా?

» అతిపెద్ద క్రీడా మైదానంలో వర్షం వస్తే నీట మునకే

» జిల్లా క్రీడాప్రాధికారసంస్థ క్రీడా సముదాయంలో అన్నీ సమస్యలే



కాకినాడలోని డీఎస్‌ఏ మైదానంలో ఇటీవల వర్షానికి చిత్తడిగా ఉన్న లోతట్టు ప్రాంతం

కాకినాడ అర్బన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఏ ఆటల పోటీలు జరగాలన్నా ఇదే పెద్ద క్రీడామైదానం.. మొత్తం 38 ఎకరాల విస్తీర్ణంలో స్టేడియం, ఆటస్థలాలు.. చుట్టూ వాకింగ్ ట్రాక్.. నిత్యం వందలాదిమందికి ఆటవిడుపు ఉండే ప్రదేశం.. అదే జిల్లా క్రీడాప్రాధికారసంస్థ క్రీడా సముదాయం. ఇది జేఎన్టీయూకే సమీపంలోని ఉంది. ఈ క్రీడామైదానం నుంచే జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు వివిధ క్రీడల్లో శిక్షణ పొందుతున్నారు.

ముళ్లపొదలు, తుప్పలు పెరిగి..

ఈ ప్రాంగణం ప్రస్తుతం సౌకర్యాల లేమితో కొట్టుమిట్టాడుతోంది. వర్షం వస్తే చాలు ప్రాంగణంలోని ఫుట్‌బాల్ కోర్టు, ఇతర ఆట స్థలాలు నీటమునుగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ప్రాంగణ అభివృద్ధికి ఎటువంటి నిధులు కేటాయించకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. చుట్టూ ముళ్లపొదలు, తుప్పలు పెరిగి నిత్యం వాకింగ్ చేసేవారికి ఇబ్బందిగా మారుతోంది. ఇక్కడ వివిధ ప్రాంగణాల్లో ఉదయం 6 నుంచి 9గంటలవరకు సాయంత్రం 4నుంచి 7గంటలవరకు అనుభవజ్ఞులైన శిక్షకులతో 13 రకాల క్రీడల్లో శిక్షణ ఇస్తూ రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీలకు క్రీడాకారులను సిద్ధం చేస్తున్నారు. రాష్ట్రంలో అతిపెద్ద స్టేడియంల్లో ఇదొకటి. ప్రతినెలా అద్దెలు, ఇతర రూపంలో రూ.6లక్షల వరకు ఆదాయం వస్తోంది. ఇదంతా రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఖాతాకే జమవుతోంది. ఉమ్మడి జిల్లా నుంచి ఏ క్రీడా పోటీలు జరిగినా ఇక్కడే నిర్వహిస్తారు. ఈ క్రీడాప్రాంగణాన్ని మరింత అభివృద్ధి చేసి ఆధునికీకరించాలని క్రీడాభిమానులు కోరుతున్నారు.

జనవరికల్లా నూతన హంగులు

ప్రస్తుతం క్రీడాప్రాంగణంలో కొన్ని సమస్యలున్నాయి. నవంబరు నెలనుంచి దీనిపై కార్యాచరణ రూపొందించి జనవరికల్లా నూతనంగా అన్ని హంగులు ఏర్పాటు చేయాలనుకుంటున్నాం. దీనికి సంబంధించి జిల్లా కలెక్టర్‌తో చర్చించాం. ఫుట్‌బాల్ కోర్టు మెరక చేయడంతోపాటు క్రీడాప్రాంగణంలో సమస్యలు దశలవారీగా దాతల సహాయంతో పరిష్కరించి ఇక్కడకు వచ్చే క్రీడాకారులకు వసతి కూడా ఏర్పాటు చేసేదిశగా ప్రణాళిక తయారు చేస్తున్నాం.

-బి.శ్రీనివాసకుమార్, శాప్ సీఈవో



క్రీడా మైదానంలో పచ్చగడ్డి తింటున్న ఆవులు



పురస్కారం అందిస్తున్న దృశ్యం

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్టు కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన తెలిపారు. నగర పాలకసంస్థ సమావేశ మందిరంలో ఉదయం 9.30 నుంచి డయల్ యువర్ కమిషనర్ తదుపరి 10 గంటల నుంచి 1గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు.

జానకిరామ్‌చౌదరికి కవిసంధ్య ప్రతిభా పురస్కారం

పోర్టుసిటీ (కాకినాడ), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ నగర సాహితీ స్రవంతి అధ్యక్షుడు మార్ని జానకిరామ్‌చౌదరికి కవిసంధ్య ప్రతిభా పురస్కారం అందజేశారు. ఆదివారం యానాం గీతాభవన్‌లో కవి సంధ్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కవి సంధ్య పత్రిక స్వర్ణోత్సవసభలో మెమెంటో, పురస్కారం అందించారు. పుదుచ్చేరి మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు, కవిసంధ్య పత్రిక సంపాదకుడు శిఖామణి చేతులమీదుగా పురస్కారం అందుకున్నారు. పురస్కార గ్రహీత జానకిరామ్‌చౌదరిని డి.విజయభాస్కర్, వాడ్రేవు చినవీరభద్రుడు, దాట్ల దేవదానం రాజు, ఎం.సత్యనారాయణమూర్తి, డాక్టర్ కృష్ణ బాబు, బొల్లోజు బాబా అభినందించారు.

ఆంజనేయరెడ్డికి జాతీయ పురస్కారం

సర్పవరం జంక్షన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి ప్రయాణికుల దాహార్తిని తీరుస్తూ, పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రమణయ్యపేటకు చెందిన అనపాల ఆంజనేయరెడ్డి సేవలకు గుర్తింపుగా పాన్ ఇండియన్-2024 జాతీయ పురస్కారం అందుకున్నారు. ఆదివారం యానాంలో పాన్ ఇండియన్ సోషియో కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంజనేయరెడ్డిని పుదుచ్చేరి ప్రభుత్వ అధికార ప్రతినిధి, మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు ఘనంగా సత్కరించారు. సాధారణ చిరు వ్యాపారస్తుడిగా జీవనం సాగిస్తూ సమాజం హితం కోసం సేవలు అందిస్తున్న ఆంజనేయరెడ్డిని యువత ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అద్దంకి రాజా యోనా, ప్రముఖ కవి గూటం స్వామి, అలయెన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ చైర్మన్ డాక్టర్ తురగా సూర్యారావు, పిల్లి రుద్ర రాజగోపాల్ పాల్గొన్నారు.

మాజీ మంత్రి పరామర్శ

తాళ్లరేవు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జార్జీపేట గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు మేర్నీడి సత్తిబాబు అకాలంగా మృతి చెందారు. ఆదివారం సత్తిబాబు చిత్రపటానికి మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సత్తిబాబు కుటుంబ సభ్యులను పరామర్శించారు. టీడీపీ నేతలు మోపూరి వెంకట రెడ్డినాయుడు, వుంగరాల వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.

వరి పంట కోతలు ప్రారంభం

సామర్లకోట, అక్టోబరు 27(ఆంధ్ర జ్యోతి): ఖరీఫ్ వరిసాగులో భాగంగా పంట పక్వదశకు చేరడంతో ఆదివారం సామర్లకోట మండలం జీ.మేడపాడు, గోలివారి కొత్తూరులలో పంట కోతలు ప్రారంభించారు. మండలంలో పెదబ్రహ్మదేవం, జీ.మేడపాడు, గోలివారి కొత్తూరు, వేట్లపాలెం, హుస్సేన్‌పురంలో ముందుగా వరి పంట సాగుచేస్తారు. అందులో భాగంగానే పంట పక్వదశకు చేరడంతో రైతులు కోతలు ప్రారంభించారు. ఖరీఫ్ వరి పంట దిగుబడులు ఆశించిన రీతిలో కాలేదని జీ.మేడపాడు రైతులు చెప్పారు. ఎకరాకు పచ్చిధాన్యం 35 నుంచి 38 బస్తాలు కాగా ఆరబెడితే 35 బస్తాలకాడికి నికరం అవు తాయని చెప్పారు. దిగుబడులు తగ్గాయన్న రైతులు అభిప్రాయాలను పరిగణనలోకి అధ్యయనం చేయనున్నట్టు వ్యవసాయాధికారులు పేర్కొన్నారు.

కాకినాడ-వేమగిరి కెనాల్ రోడ్డు అభివృద్ధికి చర్యలు

సామర్లకోట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యంతో రాష్ట్రంలో 18 ప్రధాన రహదారుల అభివృద్ధికి డీపీఆర్ తయారీకి అనుమతులు పొందినట్టు పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆదివారం వెల్లడించారు. కాకినాడ ఇంద్రపాలెం నుంచి వేమగిరి వరకూ సామర్లకోట మండలం మీదుగా 65.20 కిలోమీటర్ల మేర కెనాల్ రోడ్డు అభివృద్ధి చేయనున్నట్టు ఆయన చెప్పారు.



జిల్లా నూతన కార్యవర్గ ప్రతినిధులు

డిప్లమో ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు

పిఠాపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఏపీ పంచాయతీరాజ్ డిప్లమో ఇంజనీర్స్ అసోసియేషన్ కాకినాడ జిల్లా అధ్యక్షుడిగా పిఠాపురం సబ్‌డివిజన్ పంచాయతీరాజ్ డీఈఈ ఎస్.వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజమహేంద్రవరంలో ఆదివారం జరిగిన పంచాయతీరాజ్ శాఖ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల అసోసియేషన్ల నూతన కార్యవర్గ ఎన్నికలు రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్ కె.రవీంద్ర అధ్యక్షతన జరిగాయి. అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా టి.హేమవంతు రావు, ప్రధాన కార్యదర్శిగా టి.నూకరాజు, ఫైనాన్స్ సెక్రటరీగా ఎన్.కృష్ణమోహన్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా డి.వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. ఎన్నికల నిర్వహణకు మురళీ, కె.రమేష్ తదితరులు సహకరించారు. నూతన కార్యవర్గ ప్రతినిధులను పలువురు అభినందించారు.

ఊబిలో కూరుకుపోయి వ్యక్తి మృతి

పిఠాపురం రూరల్, అక్టోబరు 27: చెరువు ఊబిలో కూరుకుపోయి వ్యక్తి మరణించిన సంఘటన పిఠాపురం మండలం వెల్దుర్తిలో జరిగింది. గ్రామానికి చెందిన వనుం వీరబాబు (36) శనివారం రాత్రి గ్రామంలోని చెరువు వద్దకు బహిర్భూమికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలుజారి ఊబిలో కూరుకుపోయి ఊపిరి ఆడక మరణించాడు. వీరబాబుకు భార్య సత్యవేణి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. వీరబాబు సోదరుడు దుర్గారావు ఫిర్యాదుతో పిఠాపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత



మద్యాన్ని పట్టుకున్న పోలీసులు

తాళ్లరేవు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): యానాం నుంచి అక్రమంగా కాకినాడకు తరలిస్తున్న మద్యాన్ని తాళ్లరేవు ఎక్సైజ్ పోలీసులు ఆదివారం పట్టుకున్నట్టు ఎస్ఐ నాగేంద్రకృష్ణ తెలిపారు. ఇంజరం గ్రామానికి చెందిన రెడ్డి వీరబాబు మానాం మద్యం బీరుబాటిల్స్ 16 కేసులను కారులో తరలిస్తూ మట్టపాలెం వద్ద రోడ్డు పక్కనకారు పార్కు చేయగా ఎక్సైజ్ పోలీసులకు అనుమానం వచ్చి తనిఖీచేయగా బాటిల్స్ బయటపడ్డాయి. వాటిని స్వాధీనం చేసుకుని కారు సీజ్ చేశారు. కేసు నమోదు చేసి వీరబాబును రిమాండ్‌కు పంపారు.

చిత్రాడలో బాలుడికి ఆర్థిక సహాయం

పిఠాపురం రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం చిత్రాడలో బ్రెయిన్ ఫీవర్‌తో బాధపడుతున్న రాయుడు అఖిల్‌కి పిఠాపురం ఎమ్మెల్యే గారి సేవా సంస్థ సభ్యులు అండగా నిలిచారు. బొజ్జా లోవరాజు రూ.5వేలు, సంస్థ సభ్యులు కలిసి రూ.16వేలు ఆర్థికసహాయంగా అందజేశారు. ఇప్పటికే బాలుడి చికిత్సకు రూ.6లక్షల వరకూ కుటుంబసభ్యులు ఖర్చు చేశారని, తమ వంతుగా ఈ సహకారం అందజేశామని సభ్యులు తెలిపారు.



ఆర్థికసహాయం అందజేస్తున్న దృశ్యం

టీడీపీ కార్యకర్తల సంక్షేమమే ధ్యేయం

కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు



ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆన్‌లైన్ ద్వారా రూ.లక్ష శాశ్వత సభ్యత్వం తీసుకున్న బాబ్జి

కాకినాడ సిటీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు చేతులమీదుగా ఆన్‌లైన్ ద్వారా రూ.లక్ష చెల్లించి లైఫ్ టైమ్ సభ్యత్వాన్ని టీడీపీ సీనియర్ నాయకుడు గ్రంధి బాబ్జి తీసుకున్నారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ టీడీపీ కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం రెండు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించడం జరుగుతుందన్నారు. రెండు సంవత్సరాల సభ్యత్వ రుసుం రూ.100, లైఫ్ టైమ్ సభ్యత్వ రుసుం రూ.లక్ష చెల్లించాలని ఈ మొత్తాన్ని కార్యకర్తల సంక్షేమానికి వినియోగించడం జరుగుతుందన్నారు. లైఫ్ టైమ్ సభ్యత్వం తీసుకున్న గ్రంధి బాబ్జిని కొండబాబు అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లిపూడి వీరు, బచ్చు శేఖర్, అమన్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుతో భరోసా

సర్పవరం జంక్షన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదుతో పార్టీ కార్యకర్తలు, నాయకుల కుటుంబ సభ్యులకు భరోసా ఉంటుందని, కార్యకర్తల సంక్షేమమే పార్టీ బలమని టీడీపీ కాకినాడ రూరల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి అన్నారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి ఆధ్వర్యంలో నేమాం, వి.వెంకటాపురం గ్రామాల్లో పెనుమర్తి గ్రామల్లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఏరాజకీయ పార్టీకి లేని విధంగా టీడీపీకి బలమైన సంస్థాగత నిర్మాణం ఉందన్నారు. రూ.100తో సభ్యత్వం తీసుకుంటే, వారికి రూ.5 లక్షల ప్రమాద బీమా వర్తిస్తోందన్నారు. కార్యకర్తల సంక్షేమానికి కోట్లాది పార్టీ నిధులు వెచ్చించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుదన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు నమోదు చేసుకోవాలని, టీడీపీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ని గెలిపించాలని కోరారు. పార్టీ నాయకులు వాసు, బుజ్జి పాల్గొన్నారు.



టీడీపీ సభ్యత్వ నమోదు కార్డు అందిస్తున్న పిల్లి సత్యనారాయణమూర్తి, అనంతలక్ష్మి

పెద్దాపురం సుందరీకరణకు చర్యలు

ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప



శతాబ్ది పార్కును పరిశీలిస్తున్న చినరాజప్ప

పెద్దాపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణ సుందరీకరణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. పెద్దాపురం నుంచి జగ్గంపేట వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న శతాబ్ది పార్కులో సందర్శకుల కోసం ప్రైవేటు భాగస్వామ్యంతో ఏర్పాటుచేసిన ఫలహారశాలను జనసేన కాకినాడ జిల్లా ఇన్‌చార్జ్ తుమ్మల రామస్వామి (బాబు)తో కలిసి ఆయన ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెద్దాపురం నియోజకర్గంలో ఉన్న రెండు మున్సిపాల్టీలను దశలవారీగా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే శతాబ్ది పార్కును చాలావరకూ అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. గత వైసీపీ పాలకులు పార్కును నిర్వీర్యం చేశారని, దీంతో ప్రజలకు ఆహ్లాదం కరువయ్యిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మళ్లీ పార్కుకు పూర్వ వైభవాన్ని తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో పట్టణాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నేతలు రాజాసూరిబాబురాజు, తూతిక రాజు ఉన్నారు.

పిఠాపురంలో క్రైస్తవుల రాస్తారోకో

క్రైస్తవ సమాధుల స్థలాల కబ్జా ప్రయత్నంపై ఆగ్రహం



చర్చి సెంటర్‌లో రాస్తారోకో చేస్తున్న క్రైస్తవులు

పిఠాపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): క్రైస్తవ సమాధుల స్థలాల కబ్జాకు జరుగుతున్న ప్రయత్నాలను నిరసిస్తూ పట్టణంలోని చర్చి సెంటర్‌లో క్రైస్తవులు ఆదివారం రాస్తారోకో నిర్వహించారు. ఆంధ్ర బాప్టిస్టు చర్చి సెమిట్రి కమిటీ ఆధ్వర్యంలో చర్చిలో ప్రార్థనల అనంతరం వారు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సెమిట్రీ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ పట్టణంలోని అగ్రహారంలో గల క్రైస్తవుల సమాధుల నిర్వహణ, పరిరక్షణ బాధ్యతను ఏబీసీ చర్చి చూస్తున్నదని తెలిపారు. కొద్దిరోజుల క్రితం క్రైస్తవుల సమాధులు ఉన్న ప్రాంతాల గేట్లు తాళాలను కొందరు వ్యక్తులు బద్దలు కొట్టి ఆక్రమించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. వారు తాళాలు వేసి అక్కడ కార్యక్రమాల నిర్వహణకు ఆటంకాలు కలిగిస్తున్నారని తెలిపారు. క్రైస్తవుల శ్మశాన స్థలం ఆక్రమణకు గురవుతున్న విషయంపై అధికారులకు విన్నవించినా ఎవ్వరు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణ పరిధిలో బహిరంగంగా ఆక్రమణలకు ప్రయత్నాలు జరగడం దారుణమని తెలిపారు. క్రైస్తవుల సమాధులను, శ్మశాన స్థలాన్ని పరిరక్షించుకునేందుకు పోరాటం సాగిస్తామని స్పష్టం చేశారు. అధికారులు తక్షణం ఆక్రమణ ప్రయత్నాలను అడ్డుకోవడంతో పాటు ఇందుకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో ఏబీసీ చర్చి, వివిధ క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, క్రైస్తవులు పాల్గొన్నారు. ఆందోళనకారులతో ఎస్ఐ మణికుమార్ చర్చలు జరిపి ఇచ్చిన హామీతో ఆందోళన విరమించారు.

టైప్ రైటింగ్ పరీక్షల స్పాట్ వాల్యూయేషన్

కాకినాడ సిటీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సాంకేతిక విద్యాశాఖ ఇటీవల నిర్వహించిన టైప్ రైటింగ్ పరీక్షల స్పాట్ వాల్యూయేషన్ ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. కాకినాడ ప్రభుత్వ మహిళ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన స్పాట్ వాల్యూయేషన్‌కు చీఫ్ ఎగ్జామినర్ డీసీసీపీ శాఖ విభాగాధిపతి డాక్టర్ పి శంకర్ ఆధ్వర్యంలో కాకినాడ సెంటర్ టైప్ అండ్ షార్ట్‌హ్యాండ్ ఇనిస్టిట్యూట్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.శ్రీనివాసు సహకారం అందించారు. డాక్టర్ శంకర్ మాట్లాడుతూ కంప్యూటర్ యుగంలో కూడా టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్‌కు ఆదరణ తగ్గలేదన్నారు. వాల్యూయేషన్‌కు కళాశాల ప్రిన్సిపాల్ టీవీ రాజశేఖర్ సహకారం అందించారు. కార్యక్రమంలో టైప్ ఇనిస్టిట్యూట్‌ల నిర్వాహకులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించేవారికే అనుమతులు

బాణసంచా వ్యాపారులకు అధికారుల ఆదేశాలు



గొల్లప్రోలులో బాణసంచా దుకాణాల ఏర్పాటుకు పరిశీలన చేస్తున్న అధికారులు

గొల్లప్రోలు, అక్టోబరు 27: నిబంధనలు సక్రమంగా పాటించే దరఖాస్తుదారులకే బాణాసంచా దుకాణాల ఏర్పాటుకు అనుమతులు ఇస్తున్నట్టు అధికారులు స్పష్టం చేశారు. గొల్లప్రోలు పట్టణ శివారు జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల సమీపంలోని హెలిప్యాడ్ స్థలం వద్ద బాణసంచా దుకాణాల ఏర్పాటుపై తహశీల్దార్ సత్యనారాయణ, పిఠాపురం ఫైర్ ఆఫీసర్ రామకృష్ణంరాజు, ఎస్ఐ ఎన్.రామకృష్ణ ఆదివారం పరిశీలన జరిపారు. అక్కడ దుకాణాల ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్యలు, రక్షణ ఏర్పాట్లపై దరఖాస్తుదారులకు సూచనలు ఇచ్చారు. ఫైర్ ఆఫీసర్ రామకృష్ణంరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో బాణసంచా దుకాణాల కోసం 53 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. గొల్లప్రోలుకు 22మంది తాత్కాలిక లైసెన్సు కోసం దరఖాస్తు చేసుకున్నారని.. గొల్లప్రోలు, ఎఫ్‌కే పాలెంలో పర్మినెంట్ లైసెన్సుదారులు ఇద్దరు ఉన్నారని తెలిపారు. బాణాసంచా విక్రయాల్లో నిబంధనలు పాటించకుంటే చర్యలుతప్పవని హెచ్చరించారు.

బాణసంచా కేంద్రం పరిశీలన

తాళ్లరేవు: జి.వేమవరంలో బాణసంచా తయారీ కేంద్రాన్ని కాకినాడ రూరల్ సీఐ చైతన్య కృష్ణ, కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ ఆదివారం పరిశీలించి నిర్వహకుడిని వివరాలను అడిగి తెలిసుకున్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. పోలీసుసిబ్బంది ఉన్నారు.

నిబంధనలు పాటించాలి: తహశీల్దార్



మాట్లాడుతున్న తహశీల్దార్

సామర్లకోట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా వ్యాపారులు భద్రతా నిబంధనలు పాటించాలని సామర్లకోట తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి వెల్లడించారు. ఆదివారం సామర్లకోట మండల, పట్టణ పరిధిలో బాణసంచా తయారీదారులు, విక్రయదారులకు హెచ్చరికలను జారీచేశారు. ఇప్పటికే ఆయా తయారీ సంస్థల్లో, తాత్కాలిక వ్యాపారాలు నిర్వహించే ప్రదేశాలను పోలీసు,అగ్నిమాపక, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో కలసి సమీక్షించి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. సమావేశంలో డీటీ వై.శ్రీనివాస్, ఫైర్ అధికారి ఎం.శ్రీహరి జగన్నాథ్, సీఐ శ్రీకృష్ణభగవాన్ పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలపై విద్యుత్ చార్జీల భారం తగదు

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మధు



సమావేశంలో మాట్లాడుతున్న తాటిపాక మధు

కాకినాడ సిటీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వంపై రాష్ట్ర ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, అటువంటి పరిస్థితుల్లో ఊహించని విధంగా విద్యుత్ ట్రూ అప్ చార్జీల పేరిట రాష్ట్ర ప్రజలపై రూ.6,072 కోట్ల భారం మోపడం తగదని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక రేచర్లపేట వద్ద గల సీపీఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పి ఇప్పుడు ఈ విధంగా ప్రజలపై భారం మోపడం అన్యాయమని ఇప్పటికైనా ఈ భారాన్ని ప్రభుత్వం భరించాలని డిమాండ్ చేశారు. ఈ భారాన్ని ప్రజలు భరించలేరని, ఇలాగే కొనసాగితే విద్యుత్ చార్జీల పెంపు వల్ల 2003 లాగ ప్రభుత్వ పతనం ఖాయమన్నారు. అదే విధంగా కాకినాడ జిల్లాకు మరో మంత్రి పదవి కేటాయించాలని, అటువంటప్పుడే జిల్లా సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. నూతన మద్యం పాలసీలో భాగంగా ప్రతి పేటలో బెల్ట్ షాపులు వెలిశాయని, దీని వల్ల ఆయా ప్రాంతాల్లో మహిళలు తిరగడానికి ఇబ్బందులు పడుతన్నారన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కే.బోడకొండ మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని, ధరలను అదుపు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోకలప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు కెసత్యనారాయణ, అన్నవరం ఉన్నారు.

మెగా వైద్య శిబిరం

సర్పవరం జంక్షన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ వాకలపూడి కోరమండల్ ఆసుపత్రిలో శ్రీకిరణ్ కంటి ఆసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని కోరమండల్ సంస్థ యూనిట్ హెడ్ సీహెచ్ శ్రీనివాసరావు, సంకుర్రాత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ చంద్రశేఖర్ ప్రారంభించారు. డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ అంధత్వ నివారణ కోసం కోరమండల్ సంస్థ తమతో కలసి వైద్య శిబిరాలు నిర్వహించడం ద్వారా మరింత మందికి నేత్రసేవలు అందించవచ్చన్నారు. కిరణ్ కంటి వైద్యులు ఆధ్వర్యంలో సుమారు 2,500 మందికి నేత్ర పరీక్షలు చేసి 350 మందికి శస్త్రచికిత్సలు, కంటి సమస్య ఉన్నట్టు గుర్తించినట్లు యూనిట్ హెడ్ శ్రీనివాసరావు తెలిపారు. 1400 మందికి ఉచితంగా కళ్లజోళ్ల పంపిణీ జరుగుతుందన్నారు. జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాజు, కోరమండల్ డీజీఎం సీఎస్ఆర్ జయగోపాల్, జీఎం హెచ్ఆర్ పద్మనాభం ఉన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాలు

గొల్లప్రోలు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞానవేదిక కాకినాడ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గొల్లప్రోలు మాధురి విద్యాలయలో ఆదివారం చెకుముకి జిల్లా స్థాయి సైన్స్ సంబరాలు నిర్వహించారు. జాతీయ పతాకం, జేవీవీ సైన్స్ పతాకాలను మాధురి విద్యాసంస్థల అధినేత కడారి తమ్మయ్యనాయుడు, జనవిజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షుడు వి.సత్యనారాయణ రెడ్డి ఆవిష్కరించారు. జిల్లాలోని వివిధ పాఠశాలలు నుంచి విద్యార్థులకు టెస్ట్, ప్రాక్టికల్ రౌండ్, ర్యాపిడ్ రౌండ్, మ్యాప్ పాయింటింగ్, ఆడియో, వీడియో విజువల్ రౌండ్స్‌లో పోటీలు జరిగాయి. జిల్లాస్థాయిలో ప్రభుత్వ పాఠశాల విభాగంలో తుని ఏపీ రెసిడెన్షియల్ స్కూలు, ప్రవేటు పాఠశాలల విభాగంలో కాకినాడ గంగరాజునగర్ ఆదిత్య స్కూలు ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కాకినాడ ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి డాక్టర్ వరప్రసాద్, జేవీవీ జిల్లా అధ్యక్షుడు కేఎంఎంఆర్ ప్రసాద్, సత్య స్కాన్ డైరెక్టరు కాదా వెంకటరమణ, సమతా జిల్లా కన్వీనర్ చల్లా ఉమా రాజ మంగతాయారు, జిల్లా చెకుముకి కన్వీనర్ ప్రభాకరవర్మ ఉన్నారు.



మాట్లాడుతున్న జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రోడ్డు మరమ్మతులు

గండేపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): గండేపల్లి జాతీయరహదారి నుంచి రామయ్యపాలెం మీదుగా సింగరంపాలెం వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు గత ఐదేళ్లుగా అధ్వాన్నంగా ఉండి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దీంతో కూటమి ప్రభుత్వం సుమారు రూ.70లక్షలు నిధులతో మరమ్మతులు చేపట్టారు. దీంతో మూడు గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



జమాల్‌ఖాన్‌ని సన్మానిస్తున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు

పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించండి

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడికి జమాల్‌ఖాన్ బృందం విజ్ఞప్తి

చింతూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని ఆయుర్వేద వైద్యుడు, టీడీపీ నాయకుడు జమాల్‌ఖాన్ కోరారు. ఆదివారం ఆయన గాజువాకలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలిశారు. వరదలతో ఏటేటా పడుతున్న కష్టాలతో పాటు అంతర్గత రహదారులు, ఎత్తిపోతల పథకాల ఆవశ్యకతను వివరించారు. షాదీ ముబారక్ పథకాన్ని అమలు చేయించాలని కోరారు. శ్రీనివాసరావుకి జమాల్‌ఖాన్ శ్రీకృష్ణుడి చిత్రపటం అందజేసి సన్మానించారు. జమాల్‌ఖాన్‌కి శ్రీనివాసరావు శాలువా కప్పారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన వారిలో నాయకులు ముత్యాల రామారావు, ఎడవల్లి భాస్కర్, పొడియం అప్పారావు, రసూల్, ముత్యాల శ్రీరామ్, పసుపులేటి సాల్మన్ రాజు, పొదిలి రామారావు, సీలం తమ్మయ్య, తుర్రం ముత్తయ్య, కురసం ప్రసాద్, ఆణిగి చంద్రయ్య ఉన్నారు.



నినాదాలు చేస్తున్న ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు

'ఐదో షెడ్యూల్లో అన్ని హక్కులూ ఆదివాసీలకే చెందాలి'

చింతూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో అన్ని హక్కులూ ఆదివాసీలకే చెందాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బంగారు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం చింతూరులో జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవో నెం.3 అమలు చేస్తామని అరకు, కురపాం ఎన్నికల ప్రచార సభల్లో చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారన్నారు. ఈ మేరకు ఐదవ షెడ్యూల్‌లో నిధులు, నియామకాలు, నీరుపై సంపూర్ణ హక్కులు ఆదివాసీలకే చెందేలా చర్యలు చేపట్టాలన్నారు. భారత రాజ్యాంగం ఆదివాసీలకు కల్పించిన హక్కులను ప్రభుత్వాలు అమలు చేయట్లేదని, దీంతో వారు నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. హక్కుల సాధనకై ఉద్యమాలు చేపట్టేందుకు ఆదివాసీ యువత సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. మెగా డీఎస్సీలో ఏజెన్సీ పోస్టులపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు. నాయకులు సోడె మురళి, సోడె నారాయణ, పండా కృష్ణయ్య, తిమ్మసాయి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు మెమెంటోలు అందజేస్తున్న డీఈవో మల్లేశ్వరరావు

ఘనంగా చెకుముకి జిల్లా స్థాయి సైన్స్ పోటీలు

రంపచోడవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక చెకుముకి జిల్లా స్థాయి సైన్స్ పోటీలను యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వై. విల్సన్‌బాబు అధ్యక్షతన ముసురుమిల్లి ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. డీఈవో వై.మల్లేశ్వరరావు మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక 34 సంవత్సరాలుగా విద్యార్థుల విద్యాభివృద్ధికి చేస్తున్న కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం, ఆలోచన సొంతం చేసుకుంటారన్నారు. విజేతలకు మెమెంటోలు, ధ్రువపత్రాలు అందజేశారు. జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి పొందిన వారు నవంబరు 9, 10 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి చెకుముకి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు విజయరాజారావు, విశ్వరాజు, ఆచారి, కన్నారావు, డీవీవీ సత్యనారాయణ, ఐతిరెడ్డి సత్తిరెడ్డి, చిన్నిబాబు, పైడిపల్లి, కానెం శ్రీను తదితరులు పాల్గొన్నారు.



వర్ధంతి సభలో మాట్లాడుతున్న బాలుదొర

రైతు కూలీ సంఘం నాయకుడు లక్ష్మీరెడ్డి వర్ధంతి

రంపచోడవరం, అక్టోబరు 27: అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకుడు కలుగుల లక్ష్మీరెడ్డి వర్ధంతిని ఆదివారం బంద గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కంగల బాలుదొర మాట్లాడుతూ లక్ష్మీరెడ్డి ఆదివాసీ హక్కుల కోసం నిరంతర పోరాటం చేశారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఆదివాసీ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు కె.మహేష్, ఆర్.ప్రతాప్‌రెడ్డి, బి.మంగిరెడ్డి, పి.మంగిరెడ్డి, కె.విజయ్‌కుమార్, పి.ప్రసాద్, కె.భాను, సాదల భాస్కర్, పి.లచ్చిరెడ్డి, పీవోడబ్ల్యు నాయకురాలు పి.అనసూయ, సాదల చిలకమ్మ పాల్గొన్నారు.

మూడు బోట్లలో పాపికొండలు విహార యాత్రకు



దేవీపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి అందాలను ఆస్వాదించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి ప్రకృతి ప్రేమికులు పాపికొండలు విహార యాత్రకు తరలి వస్తున్నారు. రాజమహేంద్రవరం నుంచి ట్రావెల్స్ బస్సుల్లో ఆదివారం 150 మంది వచ్చారు. వారంతా పోశమ్మగండి బోటు పాయింట్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి మూడు బోట్లలో బోట్లలో పాపికొండలు వెళ్లి సాయంత్రం తిరిగి చేరుకున్నారు.

తాగునీరు వృథా... ఆగదా?

భద్రవరం, సిరిపురంలో పగిలిన పైపులు

ఏలేశ్వరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని భద్రవరం, సిరిపురం గ్రామాల్లో పైపుల ద్వారా తాగునీరు వృథాగా పోతుంది. పైపులు పగిలిపోవడంతో పంచాయితీ అధికారులు నిర్లక్ష్యం వల్ల తాగునీరు వృథాగా పోతుంది. ప్రజలు తాగు నీరు లేక నానా అవస్థలు పడుతున్నారు. దీనిపై పంచాయితీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. నిత్యం తాగునీరు వృథాగా పోతున్నా అధికారులు స్పదించడంలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు పగిలిన పైపులకు మరమ్మతులు చేసి తాగునీటి వృథాను అరికట్టడానికి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



సిరిపురంలో నీటి ట్యాంకు పైపు ద్వారా వృథాగా పోతున్న తాగునీరు



భద్రవరంలో పైపుల ద్వారా లీకవుతున్న తాగునీరు

రాష్ట్రస్థాయి పోటీల్లో తేటగుంట విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో పీఈటీ జ్యోతి

తుని రూరల్, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో తేటగుంట జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ నెల 25 నుంచి 27 వరకు హిందూపూర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో అండర్-14 బాలికల విభాగంలో రన్నర్‌గా నిలిచి విద్యార్థులు ఎస్.ప్రశాంతి, వీరవనిత బహుమతులు అందుకున్నారు. విద్యార్థులతో పాటు పీఈటీ బి.జ్యోతిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విశాలి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

వాలీబాల్ కిట్లు పంపిణీ



కిట్లు పంపిణీ చేస్తున్న తుమ్మల బాబు

ఏలేశ్వరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరంలో ఆదివారం ప్రత్తిపాడు జనసేన ఇన్‌చార్జి వరుపుల తమ్మయ్యబాబు నేతృత్వంలో 18, 20వ వార్డుకు చెందిన యువతకు జనసేన జిల్లా ఇంచార్జ్ తుమ్మల బాబు చేతుల మీదగా వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. అనంతరం బాలాజీచౌక్ సెంటర్ నుంచి మోటార్ సైకిల్‌పై పలు వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. పట్టణానికి చెందిన పొట్ల సత్తిబాబు తోపాటు పలువురు జనసేనలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పెంటకోట మోహన్, మున్సిపల్ వైస్ చైర్మన్ మసిరపు బుజ్జి, కాలారీ శ్రీనివాస్, మసిరపు నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

జగ్గంపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక గోకవరంరోడ్డులోని కాపు కల్యాణ మండపం వద్ద జగ్గంపేట మండలం సీతానగరంలో నిర్మాణం అవుతున్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి రాష్ట్ర వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి జగ్గంపేట ఆర్యవైశ్య సేవా సంఘం అధ్యక్షులు కొత్త వెంకటేశ్వరరావు రూ.20వేలు ఆర్థిక సహాయాన్ని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చేతులమీదుగా ఆలయ కమిటీ సభ్యులు కుదవ సురేష్, సింగం ఫణీంద్ర, సందర శివలకు అందించారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ నవంబరు 17న సీతానగరంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం జరుగుతుందని, ఉదయం 11గంటల నుంచి మహా అన్నదానం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మారిశెట్టి భద్రం, రేఖ బుల్లిరాజు, తొలేటి సూర్యనారాయణ, ఉప్పలపాటి బుల్లబులు, ఉదయభాస్కర్ చౌదరి,సీలం చక్రధర్ ఉన్నారు.



ఎమ్మెల్యేకు విరాళం అందజేస్తున్న దృశ్యం

అభివృద్ధి పేరుతో అన్యాయం చేయొద్దు

విమానాశ్రయం ప్రతిపాదన విరమించుకోవాలి, బెండపూడిలో రైతుల సమావేశం



విమానాశ్రయు ప్రతిపాదన విరమించాలని బెండపూడిలో నినాదాలు చేస్తున్న రైతులు

తొండంగి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పేరుతో తమకు అన్యాయం చేసి తమ భూముల్ని విమానాశ్రయానికి తీసుకోవద్దని ప్రతిపాదిత భూముల రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం బెండపూడి ఉన్నత పాఠశాల ఆవరణలో రైతులంతా సమావేశమయ్యారు. అన్నవరం విమానాశ్రయం పేరుతో బెండపూడి, పిఇ చిన్నయ్యపాలెం రైతులకు సంబంధించి 1222 మంది రైతులకు చెందిన 519 ఎకరాల భూమిని తీసుకునేందుకు ప్రతిపాదన సిద్ధం చేసినట్టు తెలిసిందని దీనిని తక్షణం రద్దు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఇప్పటికే తాము పోలవరం, పుష్కర కాల్వ, జాతీయ రహదారుల నిర్మాణంలో భూములు కోల్పోయామని, విమానాశ్రయానికి భూములు తీసుకుంటే తమ మనుగడ లేకుండా పోతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. తామంతా చిన్న సన్నకారు రైతులమని, తమను నిరాశ్రయులను చేయొద్దన్నారు. ఖాళీ భూముల్లో ఏర్పాటు చేయాల్సిన విమానాశ్రయాన్ని పచ్చని పంట పొలాల్లో ఏర్పాటు చేయాలనుకోవడం ఎంతవరకూ సమంజసమన్నారు. రైతులంతా టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే దివ్యలను కలిసి ప్రతిపాదన విరమించుకునేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరతామన్నారు. పార్టీలతీతంగా ఐక్యంగా ఉద్యమించి విమానాశ్రయ ప్రతిపాదనను విరమించేవరకూ ఉద్యమించాలని పలువురు రైతులు పేర్కొన్నారు. సమావేశంలో కొంగర విశాలాక్షి, పాలచర్ల సుబ్బారావు, బాబూరావు, యర్రబ్బు, సాధనాల నూకరాజు,ఆరుమిల్లి ఏసుబాబు, బొడ్డు శ్రీకాంత్, ఎం.సూర్యనారాయణ, రాయవరపు ఆనందరావు ఉన్నారు.

'టీడీపీ సభ్యత్వ నమోదులో అగ్రగామిగా ఉండాలి'



రౌతులపూడిలో టీడీపీ సభ్యత్వాన్ని అందజేస్తున్న మాజీ ఎంపీపీ భాస్కరబాబు

రౌతులపూడి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదులో ప్రత్తిపాడు నియోజకవర్గంలో రౌతులపూడి అగ్రగామిగా ఉండాలని మాజీ ఎంపీపీ ఇంటశెట్టి సూర్యభాస్కరబాబు అన్నారు. ఆదివారం ఆయన నివాసంలో కార్యకర్తలతో సమావేశమయ్యారు. టీడీపీ సభ్యత్వం తీసుకోవడం వల్ల కలిగే లాభాలను వివరించారు. పలువురికి సభ్యత్వాన్ని అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కైశర్ల సత్యనారాయణమూర్తి, యువ నాయకులు ఇటంశెట్టి అశోక్‌మూర్తి, యర్రా వరహాలుదొర పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

ప్రత్తిపాడు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండలం లంకలోవ గ్రామంలో ఆదివారం టీడీపీ సభ్యత్వాల నమోదును చేపట్టారు. సర్పంచ్ పి.మణికుమారి దొరబాబు కార్యక్రమాన్ని ప్రారంభించి టీడీపీ సభ్యత్వాల నమోదు వల్ల ప్రతీ కార్యకర్తకు న్యాయం జరుగుతుందని రూ.100లు సభ్యత్వంతో రూ.5లక్షల బీమా పొందచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



లంపకలోవలో సభ్యత్వ నమోదు దృశ్యం

యమలీల కళా ప్రదర్శన

ప్రత్తిపాడు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ధర్మవరంలో 88వ గౌరీశంకర్ల మహోత్సవాల్లో భాగంగా ఆదివారం కళాకారులు నిర్వహించిన యమలీల కళా ప్రదర్శన హాస్యభరింతగా సాగి ఆకట్టుకుంది. యమధర్మరాజుగా నానిపల్లి అప్పలరాజు, చిత్రగుప్తుడిగా నానిపల్లి దినేష్‌కుమార్, ప్రెసిడెంట్‌గా అమరపల్లి స్వర్ణకుమార్, భటులుగా పంపనబోయిన దుర్గాప్రసాద్, మహిళా కళాకారులుగా మణి నటించారు.



ధర్మవరంలో యమలీల కళాప్రదర్శన దృశ్యం

'అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడరాదు'

జగ్గంపేట, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట పోలీస్‌స్టేషన్ వద్ద ట్రాన్స్‌జెండర్స్‌కు జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్గంపేట సర్కిల్ పరిధిలోని గండేపల్లి మండలం మురారి వద్ద నుంచి జగ్గంపేట మండలం, కిర్లంపూడి మండలం సోమవారం గ్రామం వరకు ఉన్న ట్రాన్స్‌జెండర్స్ జాతీయ రహదారిని ఆనుకుని ఏ విధమైన అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడరాదని హెచ్చరించారు. ముఖ్యంగా పెళ్లిళ్లు, ఫంక్షన్లు వద్దకు వెళ్లి అధికస్థాయిలో డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేయరాదన్నారు. ప్రభుత్వం మీకు అందజేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేరే వృత్తులు చేపట్టి కుటుంబపోషణ నిమిత్తం ఉపాధిని కల్పించుకోవాలన్నారు. ఎస్ఐ టి.రఘునాధరావు, సిబ్బంది పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న డ్రమ్ములు, సామగ్రిని చూపిస్తున్న పోలీసులు

పదివేల లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

ఎటపాక, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిచుకలపాడు పంచాయతీ గుండువారిగూడెం గ్రామంలో ఆదివారం ఏపీఎస్పీ పోలీసుల ఆధ్వర్యంలో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. బెల్లం ఊట స్థావరాలను గుర్తించి, 10 వేల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు సీఐ కన్నపరాజు చెప్పారు. సారా తయారీకి వినియోగించే సామగ్రి, డమ్ములను స్వాధీనం చేసుకున్నారు. గ్రామాల్లో నాటుసారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తీసుకుంటామని సీఐ కన్నపరాజు హెచ్చరించారు.

కనకదుర్గమ్మ ఆలయం వద్ద అన్నదానం

మోతుగూడెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రుల ముగింపు సందర్భంగా స్థానిక కనకదుర్గమ్మ ఆలయం వద్ద ఆదివారం అన్నదానం నిర్వహించారు. సరిహద్దులోని గ్రామాల ప్రజలు, డొంకరాయి, మోతుగూడెం నుంచి వచ్చిన భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు జి.సింహాచలం, కె.రామచంద్రరావు, భగవాని రామారావు, బౌదర్ బుజ్జి, జి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

సత్యదేవుడికి జన్మనక్షత్ర పూజలు

అన్నవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి జన్మనక్షత్రం మఖ సందర్భంగా వేకువజామున 2 గంటలకు స్వామి,అమ్మవార్లను సుప్రభాతసేవతో మేల్కొలిపి అభ్యంగన స్నానమాచరింపచేసి మహన్యాసపూర్వక రుద్రాభిషేకం అనంతరం పంచామృతాలతో అభిషేకించారు. నూతన పట్టువస్త్రాలను ధరింపచేసి ఉదయం 7గంటలకు సర్వదర్శనాలకు అనుమతించారు. 9గంటలకు ఆయుష్యహోమం ప్రారంభించి పూర్ణాహుతి గావించారు.

సత్యదీక్షలు ప్రారంభం

ఏలేశ్వరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అన్నవరం శ్రీసత్యనారాయణస్వామి సత్యదీక్షలు ఆదివారం ఏలేశ్వరంలోని శ్రీఅనంత లక్ష్మీసమేతశ్రీసత్యనారాయణ స్వామి ఆలయంలో 29మంది స్వీకరించారు. పురోహితులు పోన్నూరు సత్యనారాయణ, గోపీ స్వామి అమ్మవార్లకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులు సత్యదీక్షలు ప్రారంభించారు.

'ఆదిత్య'లో ఉపాధి నైపుణ్యాభివృద్ధి శిక్షణ

గండేపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య విద్యాసంస్థల్లో ఉపాధి నైపుణ్యా భివృద్ధి శిక్షణ నిర్వహించారు. ఆదిత్య విశ్వవిద్యాలయంలోని సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో 2013 నుంచి 17 వరకు ఉత్తీర్ణులైన పూర్వ విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేసి కెరీర్ డెవలప్‌మెంట్‌పై మాట్లాడారు. విద్యార్థులు సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

మైనర్‌ను ప్రేమ పేరుతో మోసం చేసిన వ్యక్తిపై కేసు

కోటనందూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో కెఏమల్లవరంలో మైనర్‌ను ప్రేమ పేరుతో మోసం చేసిన రాపాక ప్రసాద్ పై పోక్సోయాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు తెలిపారు. బాలిక ఇంటికి వెళ్లి ఆదివారం విచారణ చేపట్టామని, తగు చర్యలు తీసుకుంటున్నామనిఎస్ఐ రామకృష్ణ చెప్పారు.

భూ వివాదంలో కత్తితో దాడి

ఒకరికి గాయాలు

ప్రత్తిపాడు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోటపల్లి గ్రామంలో ఆదివారం భూ వివాదానికి సంబంధించిన వ్యవహారంలో జరిగిన దాడిలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల సమాచారం మేరకు... తోటపల్లికి చెందిన కోరాకు చిట్టియ్య, పులి సతీష్‌ల మ ద్య భూ వివాదం ఉంది. ఈ క్రమంలో సతీష్ కత్తితో చిట్టియ్యపై దాడికి పాల్పడగా చిట్టియ్యకు తీవ్రగాయాలయ్యాయి. బాధితుడిని ఆసుపత్రికి తరలించి ఎస్ఐ ఎస్.లక్ష్మీకాంతం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జ్యోతుల నవీన్ ఆత్మీయ సమావేశం

జగ్గంపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గోకవరం మండలం కామరాజుపేటలో జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. టీడీపీ సభ్యత్వ నమోదు, ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు, జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెళ్లికానుక కార్యక్రమాలపై ఆయన అవగాహన కల్పించారు.

దుర్గమ్మ ఆలయం కిటకిట



గండేపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మురారి గ్రామ శివారున వెలసిన కనకదుర్గమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుని కుటుంబసమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.